



# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 19-06-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 267 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### ప్రజలు నిజాయితీగా
# పన్నులు చెల్లించాలి

- చమురు ధరల్లో ఉపశమనం లభిస్తుంది
- కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ



న్యూదిల్లీ: ప్రజలు నిజాయతీగా తమ వాటా పన్నులు చెల్లిస్తే ప్రభుత్వం ఆదాయం కోసం చమురుపై ఆధారపడే పరిస్థితి ఉండదని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. దీంతోపాటు చమురుపై ఎటువంటి పన్ను కోతలు ఉండబోవని ఆయన తేల్చి చెప్పారు. ఇటువంటి చర్యలు వ్యతిరేక ఫలితాలను ఇస్తాయన్నారు. కేవలం వేతన జీవులు మాత్రమే పన్నులు సక్రమంగా చెల్లిస్తున్నారని జైట్లీ పేర్కొన్నారు. మిగిలిన వర్గాలు కూడా పన్నుల చెల్లింపును మెరుగుపర్చుకోవాలని కోరారు.

నేను రాజకీయ నాయకులు, విశ్లేషకులకు ఒక విషయం విజ్ఞప్తి చేస్తున్నాను. ఇంధనేతర రంగాల్లో పన్నుల ఎగవేతను ఆపాలని తరువాయి 2లో..

### రెవెన్యూ సంబంధిత సమస్యల్ని
# వెంటనే పరిష్కరించాలి



హైదరాబాద్: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రెవెన్యూ సంబంధిత సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించారు. బీఎన్ రెడ్డి నగర్, సాహేబ్‌నగర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న రెవెన్యూ సంబంధిత సమస్యల్ని పరిష్కారానికి ఎల్బీనగర్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల నాగోలులో జరిగిన మన నగరం కార్యక్రమంలో రెవెన్యూ తరువాయి 2లో..

# మాల్యాపై ఈడీ ఛార్జ్‌షీట్

### మాల్యా ఆస్తులను ఫ్రీజ్ చేయాలి
### జూలై 31న ఇరు వర్గాల వాదన

న్యూఢిల్లీ: ఎస్‌బీఐ అనుబంధ బ్యాంకులకు వేల కోట్లు ఎగవేసిన విజయ్ మాల్యాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ సోమవారం చార్జ్‌షీట్ నమోదు చేసింది. మనీల్యాండరింగ్ కేసు కింద ఈ అభియోగాలను దాఖలు చేశారు. అయితే భారతీయ బ్యాంకులకు కనీసం రెండు లక్షల పౌండ్లు చెల్లించాలంటూ ఇటీవలే విజయ్ మాల్యాకు బ్రిటన్ హైకోర్టు ఆదేశించింది. 13 బ్యాంకులకు ఆ సొమ్ము అందాలంటూ కోర్టు పేర్కొన్నది. స్టేట్ బ్యాంక్ ఇండియా నేతృత్వంలోని 13 బ్యాంకులు వేసిన పిటీషన్‌ను బ్రిటన్ కోర్టు స్వీకరించింది. మే 8వ జరిగిన వాదనల్లో ఆ కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. జడ్జి ఆండ్రూ హెన్‌షా ఈ తీర్పును వెలువరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మాల్యా ఆస్తులను ఫ్రీజ్ చేయాలంటూ కోర్టు ఆ తీర్పులో ఆదేశించింది. ఈ కేసులో ఇరు వర్గాల వాదనలు తరువాయి 2లో..

### డెంగ్యూ నియంత్రణకు
## సంచార మలేరియా డెంగ్యూ అవగాహన శిబిరాలు

వార్త 2లో..







# ఓసాకాలో భూకంపం

- వణికిపోయిన జపాన్..
- టోక్యో, క్యోటో, ఇషాకా తదితరతర ప్రాంతాల్లోనూ ప్రకంపనలు
- భారీగా ధ్వంసమైన వాహనాలు
- లెక్కలేనంతమంది క్షతగాత్రులు
- కొనసాగుతున్న సహాయక చర్యలు



టోక్యో: భారీ ప్రకంపనలు జపాన్‌ను ఒక్కసారిగా వణికించాయి. భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం పశ్చిమ జపాన్ కేంద్రంగా భూకంపం సంభవించింది. ఈ విపత్తులో ఇప్పటిదాకా ముగ్గురు మరణించగా, 240 మందికి తీవ్ర గాయాలైనట్లు అధికారులు ప్రకటించారు. ఒసాకా పట్టణ తరువాయి 2లో..






## డెంగ్యూ నియంత్రణకు

# సంచార మలేరియా డెంగ్యూ అవగాహన శిబిరాలు



విశాఖపట్నం: నగరంలో పెరుగుతున్న డెంగ్యూపై గత శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య డెంగ్యూను నియంత్రించడానికి ప్రజలలో అవగాహన కల్పించి, తద్వారా భాగస్వాములను చేయడానికి తక్షణమే మొబైల్ మలేరియా, డెంగ్యూ క్లినిక్‌ను నిర్వహించాలని ఆదేశించారు. తదనుగుణంగా ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ సంచాలకులు డా.అరుణకుమారి 23 ఎంఎండిసిలను విశాఖపట్నం జిల్లాకు కేటాయించారు.

అందులో భాగంగా సోమవారం మొదట 10 ఎంఎండీసీలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఇది జివియంసి పరిధిలో డెంగ్యూ ప్రభావిత ప్రాంతాలైన మధురవాడ, పి.ఎం.పాలెం, డాబాగార్డెన్స్, కంచరపాలెం, మర్రిపాలెం, ద్వారకానగర్ మొదలగు ప్రాంతాలో పనిచేశారని, మిగిలిన 13 ఎంఎండీసీలను త్వరలో ప్రారంభిస్తారమని తెలియజేశారు.

ఈ ఎంఎండీసీలో ఒక హెల్త్ ఎడ్యుకేటర్, ఒక హెల్త్ సూపర్‌వైజర్, ఒక హెల్త్ అసిస్టెంట్ వుంటారు. వీరు జివియంసి లోని మలేరియా సిబ్బందితో కలిసి డెంగ్యూ ప్రభావిత ప్రాంతాలతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలలో డెంగ్యూ దోమలు పెరుగు ప్రదేశాలను, వాటిని ఎలా నియంత్రించాలని అవగాహన కల్పిస్తారు. మరియు ఇంటింటి జ్వరాల సర్వేను చేసి, డెంగ్యూ లక్షణాలు ఎవరిలోనైనా కనిపిస్తే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేస్తారు. జ్వర పీడితుల నుండి రక్త నమూనాలను సేకరించి మలేరియా పరీక్ష చేస్తారు. మలేరియా నిర్ధారణ అయితే చికిత్స అందజేస్తారు. ఇదే సమయంలో జివియంసి మలేరియా సిబ్బంది దోమల నియంత్రణకు డోర్ టు డోర్ లార్వల్ సర్వే, ఆంటి లార్వల్ ఆపరేషన్స్ నిర్వహిస్తారు. సాయంత్రంపూట అదే ఏరియాలో ఫాగింగ్ చర్యలు చేపడతారు.

ఈ కార్యక్రమంలో అదనపు సంచాలకులు (మలేరియా & ఫైలేరియా)డా.శారదా, జోనల్ మలేరియా అధికారి డా.ఎ.వి.లక్ష్మి, అసిస్టెంట్ డైరక్టర్ బిఎల్ఎన్.కుమార్, జిల్లా మలేరియా అధికారి వై.మణి, జివియంసి ప్రధాన వైద్యాధికారి డా.హేమంత్, బయాలజిస్ట్ పైడిరాజు, సీనియర్ అంటమాలజిస్ట్ డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

# సామూహిక దరఖాస్తుల కార్యక్రమం



ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

నాతవరం : సిపిఐ నాతవరం మండల కార్యదర్శి అజయ్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారం కోసం సామూహిక దరఖాస్తుల కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నాతవరం తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి అనంతరం సామూహిక దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, రేషన్ కార్డులు, పెన్షన్లు, సాగు భూములకు, తాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల స్వాధీనంలో ఉన్న ఇళ్ల స్థలాలకు, సాగు భూములకు వెంటనే స్థలాలు ఇవ్వాలన్నారు. స్వామినాధన్ కమిషన్ సిఫార్సులు చిత్తశుద్ధిగా అమలు చేయాలని, జన్మభూమి కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండల సమితి సభ్యులు మాసర్ల రాజు, కురువాడ నాగేశ్వరరావు, మాణిక్యం, భవానీ తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు రహదారి సౌకర్యం

రావికమతం : మండలంలోని అప్పలమ్మపాలెం గ్రామస్థుల రహదారి కల ఎట్టకేలకు నెరవేరింది. సుమారు 550 మంది జనాభా ఉంటున్న ఈ గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షాకాలం అయితే నరకయాతన అనుభవించేవారు. కనీసం ఆటో కూడా వెళ్లేది కాదు. దీంతో ఎన్నో ఏళ్లుగా గ్రామస్థులు రహదారి సౌకర్యం కల్పించాలని పాలకులు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో మేడివాడ సర్పంచ్ అరిశంకల రామారావు రహదారి సమస్యను ఎంపిపి దంగేటి రామకృష్ణ, జెడ్పీటీసీ రాజాన శ్రీవాణి, టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు దృష్టికి తీసుకువెళ్లి సహకారంతో ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో రూ.32లక్షలు ఉపాధి, ఏబిఎన్ నిధులు మంజూరు కావడంతో మేడివాడ నుంచి అప్పల్మమపాలెం వరకూ 650 మీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులు చివరి దశకు చేరుకోవడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## 20 నుంచి కార్పొరేషన్ ఇంటర్వ్యూలు

గొలుగొండ : కార్పొరేషన్ రుణాల కోసం ఈ నెల 20, 21 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎంవి.సువర్ణరాజు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తొలి రోజు బిసి కార్పొరేషన్‌కు, మరుసటి రోజు ఎస్సీ, కాపు ఇతర కార్పొరేషన్‌లకు రుణాల నిమిత్తం దరఖాస్తులు చేసిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సిందిగా కోరారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారు మూడు జతల జెరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు.

# ప్రజా ఫిర్యాదులను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు

**జిల్లా ఎస్పీ జి. పాలరాజు**



విజయనగరం : జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి. పాలరాజు సోమవారం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ వ్యధ విభాగానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 15 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఈ ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వయంగా స్వీకరించి, ఫిర్యాదుదారులతో మాట్లాడి, ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటిని పరిష్కరించేందుకు, వాటిపై చర్యలు చేపట్టేందుకు సదరు ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు పంపారు. జామి మండలానికి చెందిన నారాయణమ్మ ఫిర్యాదు చేస్తూ తన ఖాళీ స్థలంలో ఇంటిని నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నట్లు, సదరు ఖాళీ స్థలంలో ఇది వరకు పెట్టిన రెండు కిరాణా బడ్డీలను తొలగించేందుకు సదరు యజమానులు అంగీకరించకుండా తాను చేపట్టే నిర్మాణానికి ఆటంకం కలిగిస్తున్నట్లు, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందిచిన ఎస్పీ పూర్తి స్థాయి విచారణ చేపట్టి, ఫిర్యాదికి న్యాయం చేయాల్సిందిగా ఎస్. కోట సిఐను ఆదేశించారు. విజయనగరం పట్టణానికి చెందిన అర్జి అప్పలరాజు విజన్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థకు ఎం.డి.గా పనిచేయుచున్న పోలవరపు వసంత రావుకు రూ. 5 లక్షలు డిపాజిట్‌గా చెల్లించినట్లు, తదుపరి సదరు సంస్థ యజమాని పరారీకాగా, తాను ఇచ్చిన ఫిర్యాదుపై విజయనగరం 1వ పట్టణ పోలీసులు 4 సంవత్సరాల క్రితం కేసు నమోదు చేసినప్పటికి, నిందితుడు ఇంత వరకు దొరకలేదని, న్యాయం చేయాల్సిందిగా ఎస్పీని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ నిందితుడ్ని పట్టుకొనేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించాలని విజయనగరం 1వ పట్టణ సిఐను ఆదేశించారు. డెంకాడ మండలం అక్కివరంకు చెందిన స్వామీ సుదర్శనానంద సరస్వతి ఫిర్యాదు చేస్తూ అక్కివరం గ్రామంలోగల సచ్చిదానంద ఆశ్రమ ట్రస్టుకు చెందిన భూములను కొంత మంది తప్పుడు పత్రాలతో ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ భోగాపురం సిఐను పూర్తి స్థాయి విచారణ చేపట్టాల్సిందిగాను, తనకు వాస్తవాలను నివేదించాల్సిందిగా ఆదేశించారు. డెంకాడ మండలం, అక్కివరం గ్రామానికి చెందిన సన్యాసమ్మ ఫిర్యాదు చేస్తూ గతంలో తన కుమారులతో కలసి భూములు కొనుగోలు విషయమై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సాక్షిగా వెళ్ళి సంతకాలు చేసినట్లు, ఇప్పుడు కె. త్రిమూర్తులు అనే ఆసామీ మరికొంత మందితో కలసి తన ఇంటికి వచ్చి తనను అసభ్య పదజాలంతో ధూషిస్తున్నట్లు, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ పూర్తి స్థాయి విచారణ చేపట్టాల్సిందిగా, ఇరువురి డాక్యుమెంట్లను పరిశీలించి, వాస్తవాలను నివేదించాల్సిందిగా ఆదేశించారు. ఎల్. కోట మండలం కోనమశివానిపాలెం గ్రామ పంచాయితీ పరిధిలో నిర్మించిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సిరిసిపల్లి రాంబాబు, కొంత మంది వ్యక్తులు ధ్వంసం చేసారని వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ పంచాయితీ సెక్రటరీ బుగత లక్ష్మణ రావు ఫిర్యాదు చేసారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కేసు నమోదు చేయాలని ఎస్. కోట సిఐను ఆదేశించారు. ఫిర్యాదుల విభాగంకు వచ్చే ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కుణ్ణంగా పరిశీలించి, వాటిపై తక్షణమే స్పందించాలని, వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను తనకు వెంటనే నివేదించాలని జిల్లా ఎస్పీ పాలరాజు పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐలు వై.వి.శేషు, రామకృష్ణ, ఎస్ఐ డి.రవికుమార్‌లు పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాలు, ఇళ్లు, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

నర్సీపట్నం : ఇళ్ల స్థలాలు, ఇళ్లు, పోడు భూములకు పట్టాలు, పేదల స్వాధీనంలో ఉన్న ఇళ్లకు పట్టాలు, పెండింగ్‌లు దరఖాస్తులు పరిశీలన జరిపి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కోరుతూ సిపిఐ జిల్లా సమితి పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలో భాగంగా నర్సీపట్నంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ ఇప్పటికే సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. స్వామినాధన్, కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేయాలన్నారు. పేదల నివశించే ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. రూ.3వేల కనీస పింఛన్ అమలు చేయాలన్నారు. జన్మభూమి కమిటీలను రద్దు చేస్తూ జిఒ విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రుత్తల పెదబుజ్జి, రూరల్ కార్యదర్శి నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, సిపిఐ సమితి సభ్యులు ఎం.అప్పలరాజు, శ్రీనివాస్, మహిళా సమాఖ్య నాయకులు సూర్య, కళ్యాణి, గబ్బాడ లక్ష్మి సిపిఐ నాయకులు పాల్గొన్నారు.




తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిపిఐ నాయకులు

**మొదటి పేజీ తరువాయి**

## ప్రజలు నిజాయితీగా పన్నులు చెల్లించాలి

కోరుతున్నాను. ప్రజలు కనుక అన్నిరకాల పన్నులు సక్రమంగా చెల్లిస్తే చమురుపై విధించే పన్నులు తగ్గుముఖం పడతాయి అని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఫేస్‌బుక్‌లో ఒక పోస్టు పెట్టారు.

2017-18 జీడీపీలో చమురేతర రంగం నుంచి వచ్చిన పన్నుల వాటా 9.8శాతంగా ఉందని జైట్లీ పేర్కొన్నారు. 2007-08 తర్వాత ఇదే అత్యధికమన్నారు. దీంతోపాటు ఇంధనంపై రాష్ట్రాలు విధిస్తున్న పన్నులను తప్పుపట్టారు. వినియోగదారులు ఆర్థికంగా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే చమురు ధరల్లో ఉపశమనం లభిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఆర్థికంగా బలపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రాలు అదనంగా విధించే పన్నుల కారణంగానే చమురు ధరలు అసాధారణంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఇటీవల కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం మాట్లాడుతూ కేంద్రం తలుచుకుంటే చమురు ధరను రూ.25 తగ్గించవచ్చు అని పేర్కొన్నారు. అయితే చిదంబరం వ్యాఖ్యాలు పూర్తిగా మోసపూరితమైనవని జైట్లీ విమర్శించారు.

## రెవెన్యూ సంబంధిత సమస్యల్ని వెంటనే పరిష్కరించాలి

సంబంధిత సమస్యల్ని స్థానిక ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సర్వే నెం 104, 102లకు సంబంధించిన వివాదాలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశంలోగా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని అసైన్డ్ భూముల వివాదాలను ఓ కొలిక్కి తీసుకొస్తామన్నారు. మన్సురాబాద్‌లోని ప్రెస్‌కాలనీ, వాంబే కాలనీలోని ఇప్పటికీ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోని వారికి మరోసారి జీవో 58, 59కింద దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం ఇస్తామని స్పష్టంచేశారు. హస్తినాపురం జనార్దన్‌రెడ్డి కాలనీలలో స్వాతంత్ర్య సమరయోధుల భూములకు సంబంధించి పదేళ్లు పూర్తయినందున రిజిస్ట్రేషన్ చేయించుకొనేందుకు ఎన్‌వోసీలు అందిస్తామన్నారు. సాహెబ్‌నగర్‌లో భూ వివాదాలకు సంబంధించి వక్ఫ్ అధికారులతో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ నేతృత్వంలో సమావేశం నిర్వహిస్తామని కేటీఆర్ వెల్లడించారు.

## ఓసాకాలో భూకంపం

కేంద్రంగా రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రతతో భూకంపం సంభవించిందని వాతావారణ శాఖ తెలిపింది. తీవ్రత తక్కువదే అయినప్పటికీ.. భూకంపం శక్తివంతమైనదిగా శాస్త్రవేత్తలు తేల్చారు. అయితే సునామీ అలర్ట్ మాత్రం ప్రకటించలేదు. ఆఫీస్‌లకు వెళ్లే సమయంలో ప్రకంపనలు సంభవించటంతో ప్రజలు ఒక్కసారిగా పరుగులు తీశారు. వేల సంఖ్యలో ప్రజలు ఇళ్లు వదిలి భయంతో రోడ్ల మీదే గడిపారు. ఒసాకాతోపాటు రాజధాని టోక్యో, క్యోటో, ఇషాకా... ఇలా జపాన్‌లోని పలు ప్రాంతాల్లో కూడా అదే సమయంలో ప్రకంపనలు సంభవించినట్లు అధికారులు చెబుతున్నారు. మృతుల్లో 9 ఏళ్ల చిన్నారి ఉందని, ప్రస్తుతం విద్యుత్ సరఫరాను నిలిపేసి సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు సహాయక సిబ్బంది తెలిపారు. క్షతగాత్రుల సంఖ్య, మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని వారంటున్నారు. 1995లో 6.9 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపం 6 వేల మందికి పైగా బలి తీసుకుంది. ఆ తర్వాత అంతటి స్థాయిలో కాకపోయినా.. తరచూ భూకంపాలు, సునామీలు జపాన్‌ను వణికిస్తూ వస్తున్నాయి.

## మాల్యాపై ఈడీ ఛార్జ్‌షీట్

జూలై 31వ తేదీన జరగనున్నాయి. తనపై నమోదు అయిన క్రిమినల్ ఆరోపణలు నిరాధారమైనవని మాల్యా తరపున లాయర్ కోర్టులో వాదించారు. భారతీయ బ్యాంకులకు మాల్యా సుమారు 9వేల కోట్లు ఎగ్గొట్టారు. ఆ కేసులో అతన్ని భారత్‌కు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అప్పగింత కేసులో అతను వచ్చే నెలలో వెస్ట్‌మినిస్టర్ మెజిస్ట్రేట్ కోర్టు ముందు కూడా హాజరుకానున్నారు.

# యోగాభ్యాసానికి చక్కని స్పందన

బెంగళూరు : అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపిన 2వేల మంది దివ్యాంగులకు అక్షర యోగా సంస్థ ఆదివారం శిక్షణ ఇచ్చింది. ఆస్ట్రేలియా క్రికెటర్ మ్యాథ్యూ హైడెన్, నటి సంజనా గల్రాని, సామాజిక పోరాట యోధులు డా.ఆర్.వి.మమత, శ్రుతి కోనాన, తదితరుల సమక్షంలో వీరికి శిక్షణ ఇచ్చారు. వేర్వేరు స్వచ్ఛంద సంస్థల సహకారంతో మ్యాన్ఫో కన్వెన్షన్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగులకు ఉచిత వస్త్రాలు, యోగా మ్యాట్, పానీయాలు, ఆహారం అందించారు. మానసిక, శారీరక ఆరోగ్యం కాపాడుకునేందుకు ఉపయుక్తమయ్యే ఆసనాలను గ్రాండ్ మాస్టర్ అక్షర్, ఇతర అభ్యాసకులు బోధించారు.

ఈనెల 21వరకు తాము వేర్వేరు ప్రాంతాల్లో అభ్యాస శిక్షణను కొనసాగించనున్నట్లు ఆయన తెలిపారు. మాజీ క్రికెటర్ మ్యాథ్యూ హైడెన్ తన కుటుంబ సభ్యులతో అభ్యాస ప్రక్రియలో పాల్గొనటమే కాక, దివ్యాంగ విద్యార్థులు ఉత్సాహంగా శిబిరంలో పాల్గొనేందుకు సహకారం అందించారు.

# పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే



చెన్నై : పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు వీఎల్ ఇందిరాదత్ పేర్కొన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తగా గుర్తింపు పొందిన ఆమె వివిధ రంగాల్లో అనేక ఘనతలు సాధించడంతోపాటు అవార్డులు అందుకున్నందుకుగాను ప్రపంచ తెలుగు సమాఖ్య కమిటీ సభ్యులు, ఆంధ్ర కళాస్రవంతి నిర్వాహకులు సంయుక్తంగా అభినందన సభ ఆదివారం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళారత్న, సవితా విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ ఆఫ్ సైన్స్, సీఐఐ నుంచి డిస్టింగ్విస్డ్ పర్సనాలిటీ తదితర పురస్కారాలు అందుకున్నందుకు ఆమెను అభినందిస్తూ తెలుగు ప్రముఖులు, వివిధ సంస్థల నిర్వాహకులు ప్రసంగించారు. ప్రముఖ సినీ గేయరచయిత వెన్నెలకంటి పంపిన అభినందన పత్రం, శాలువాతో ఆమెను సన్మానించారు.

ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ... సమాజంలో మహిళలకు కార్యనిర్వాహక సామర్థ్యం, విజ్ఞత, సాధికారత అవసరమన్నారు. సినీ రచయిత, పద్మభూషణ్ అవార్డు గ్రహీత యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, ద్రవిడ దేశం పార్టీ అధ్యక్షులు కృష్ణారావు, ఆస్కా అధ్యక్షులు సుబ్బారెడి, ఆస్కా మాజీ అధ్యక్షులు ఆది శేషయ్య, ఆంధ్ర కళాస్రవంతి నిర్వాహకులు జేఎం.నాయుడు, ముగప్పేరు తెలుగు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.వీరభద్రరావు, పెరంబూరు తెలుగు అసోసియేషన్ నిర్వాహకులు తమ్మినేని బాబు, శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపకులు బేతిరెడ్డి శ్రీనివాసులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చూపు లేని వారి జీవితాల్లో వెలుగు నింపడమే

# ఎంపిఎం ట్రస్ట్ లక్ష్యం

## ఉచిత కళ్ళజోళ్లు పంపిణీ



విశాఖ సిటీః రాష్ట్ర శాసన మండలి సభ్యుడు డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎమ్.పి.ఎమ్. ట్రస్టు ఇటీవల ఎన్‌టిఆర్ సేవా సమితి ట్రస్టుతో కలసి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలలో నేత్ర పరీక్షలు చేయించుకున్నవారికి ఉచిత కళ్ళజోళ్ల వితరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక తాటిచెట్లపాలెం ఆంజనేయస్వామి గుడి దగ్గర 34వ వార్డు సామాజిక భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి పైలా ముత్యాలనాయుడు మరియు ట్రస్టు సభ్యులు హజరయ్యారు. ఈ సందర్బంగా ఈ వైద్య శిబిరాల ద్వారా ప్రజలందరికి ఉచితంగా వైద్యం అందించడంతో పాటు అవసరమైన వారందరి ఉచితంగా కళ్ళజోళ్లు అందించడం పట్ల ప్రజలు చాలా అనందంగా ఉందన్నారు.ఆర్థిక సమస్యలతో వైద్యం అందక,వైద్యం చేయించుకొనే పరిస్థితి లేక కంటి చూపు ఆనక ఇబ్బందులు పడుతున్న వారి జీవితంలో వెలుగులు నింపడం డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి లక్ష్యం అన్నారు.

గీతం ఆస్పత్రి, దంత వైద్య కళశాల, ఆస్పత్రి వైద్య బృందాల నిరంతర కృషి ద్వారానే ఇది సాద్యపడిందన్నారు.

కార్యక్రమంలో స్థానిక నాయకలు పైలా ముత్యాల నాయుడు, 34 వార్డు ప్రెసిడెంట్ వాసుపల్లి రాజు, ట్రస్ట్ నిర్వాహకులు ఆళ్ళ శ్రీనివాసు, పి.వి.రామారెడ్డి, అత్తిలి శంకరావు తదితరులు పాల్గొన్నారు.

# తోకాడ కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు

సోమవారం నగర పర్యటన .. జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం: జివియంసి ఐదవ జోన్ 59వ వార్డులోని తోకాడ కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా తోకాడ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తోకాడ కాలనీలో అనధికార ఇండస్ట్రీలు నెలకోల్పడం వలన వృద్ధులు, పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా కాలనీలో క్రమశిక్షణ తప్పుతోందని వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్, ఇండస్ట్రియల్ జోన్లను నిర్ధారించాలని సిసిపి విద్యుల్లతను ఆదేశించారు. అదేవిధంగా ఇండస్ట్రియల్ వివరాలు తెలుసుకోడానికి డి అండ్ ఓ ట్రేడ్ వివరాలు సేకరించాలని సి.యం.ఓ.హెచ్‌డా.హేమంత్‌ను ఆదేశించారు. 10 రోజులలో పూర్తి నివేదిక సమర్పించి సమస్య పరిష్కారానికి దోహదపడాలని కోరారు.

పర్యటనలో సి.సి.పి విద్యుల్లత, సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్, ఏ.యం.ఓ.హెచ్ డా.యస్.జయరాం, జోనల్ కమిషనర్ వి.చక్రధరరావు, ఏసిపి శ్రీదేవి, జోనల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ పనుల పూర్తి కొరకు దరఖాస్తు



విశాఖపట్నంః గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ 50వ వార్డు పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం జరిగినది కానీ, వాటిని ఇంతవరకూర్తి చేయలేదు, కావున త్వరగా వాటిని పూర్తి చేసి నగర వాసులకు వెసులుబాటు కల్పించవలసినదిగా కోరుతూ గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ 50వ వార్డు పరిధి గాజువాకలో జోన్-5 జన్మభూమి కమిటీ సభ్యుడు, విశాఖ టిడిపి అర్బన్ జిల్లా కార్యదర్శి దొడ్డి రమణ సబంధిత వార్డు శాసనసభ్యుడైన పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. మొదటగా వాంబే కాలనీలో చాలా సార్లు విద్యుత్ వైర్లు, స్తంభాల కొరకు ప్రతిపాదన జరిగింది గానీ ఇప్పటి వరకు ఆ పని పూర్తి కాలేదన్నారు. అలాగే కొంగపాలెం వద్ద రోడ్డు పనులకు శంకుస్థాపన అయితే జరిగింది కానీ రోడ్డు నిర్మాణం జరగలేదని ఆరోపించారు. సగంలో నిలిపివేసిన యాతపాలెం రోడ్డు నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవలసినదిగా విజ్ఞప్తి చేయడమైనదన్నారు. సత్యనారాయణపురంలో పాడైన డ్రైన్లు, రోడ్డు నిర్మాణం త్వరిత గతిన జరపవలసినదిగా కోరారు. వాంబే కాలనీలో డ్రైనులు, మంచినీటి పైపు లైన్ల పనులు పూర్తిచేసి వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చవలసిందిగా సబంధిత వార్డు శాసనసభ్యుడైన పల్లా శ్రీనివాసరావును కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు.

## వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కంట్రోల్ రూం ఏర్పాటు

విశాఖపట్నం: ప్రస్తుత వాతావరణ పరిస్దితుల దృష్ట్యా జివియంసి ప్రధాన కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ప్రజలు వర్షాలు వలన ఎటువంటి ఇబ్బంది ఎదురైనా కంట్రోల్ రూం ఫోన్ నెంబర్ 0891-2569335/2569335కు ఫోన్ చేసి సమాచారం అందించాలని పేర్కొన్నారు. నేటి నుండి సెప్టెంబరు నెలాఖరు వరకు అందరు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. అదేవిధంగా లోతట్టు ప్రాంతాలలోని కాలువలు, గెడ్డలు పొంగడం వలన ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని ఎప్పటికప్పుడు తోడేవిధంగా, చెట్లు, చెట్లకొమ్మలు పడిపోతే వెంటనే తొలగించడానికి హార్టికల్చర్ ఆఫీసర్‌తో బాటు జోనల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. జోనల్ కమిషనర్లు, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు సిబ్బంది అందుబాటులోఉండాలని పేర్కొన్నారు.

# డ్రై డే పాటించండి

విశాఖపట్నం: జివియంసి పరిధిలోని ప్రజలు వారానికి ఒకరోజు డ్రై డే పాటించడం ద్వారా డెంగూ, మలేరియా వ్యాధులను నివారించవచ్చునని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. డెంగూ జ్వర కారక క్రిమి ఏడిస్ ఈజిప్టి జాతి దోమ ద్వారా వ్యాధి సంక్రమిస్తుంది. ఈ దోమలు పగటిపూట ఇంటిలోని ఫ్రిజ్, ఖాళీసీసాలు, కొబ్బరి బోండాలు, పాత టైర్లు, ట్యూబులు ఆర్నమెంటల్ ప్లాంట్స్‌లో ఉంటాయి. ఇంటి లోపల - బయట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధి సోకకుండా నివారించవచ్చును. దోమ కుట్టిన 5-8 రోజులకు వ్యాధి లక్షణాలు కన్పిస్తాయి. జ్వరం 24 గంటలలో తగ్గకపోతే రక్త పరీక్ష చేయించుకొని, చికిత్స చేయించుకోవాలి.

ముందు జాగ్రత్తగా ప్రతి గృహిణి తన ఇంటిలోని నీటి తొట్టెలను ఖాళీ చేసి మరల తాజా నీటితో నింపుకోవాలి. ఇంటిపై వాటర్ ట్యాంకులకు మూతలు బిగించాలి. ఇంట్లోని ఏసిలు, ఎయిర్ కూలర్స్, ఫ్రిజ్, ఫ్లవర్ వాజ్‌లు, మనీప్లాంట్‌లోని నీటిని మూడురోజులకు ఒకసారి పారబోసి నింపుకోవాలి. డెంగూ నిర్ధారణ పరీక్షలు కె.జి.హెచ్‌లోనే చేసే అవకాశం ఉన్నందున డాక్టర్ సలహాతో నిర్ధారణ గావించుకోని చికిత్స పొందాలి.

కావున ప్రజలు అప్రమత్తతతో కొంచెం శ్రమపడితే అనారోగ్యానికి గురవకుండా ఆరోగ్య విశాఖకు దోహదపడతారని పేర్కొన్నారు.

### డయల్ యువర్ కమిషనర్‌కు 11 ఫిర్యాదులు

విశాఖపట్నం: జి.వి.యం.సి ప్రధాన కార్యాలయంలో సోమ వారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెంబరు 1800-4250-0009) కార్యక్రమానికి 11 ఫిర్యాదులు అందాయి. అదనపు కమిషనర్ (ఫైనాన్స్) ఎస్ ఎస్ వర్మ హాజరై పలువురి నుండి వచ్చిన ఫోన్ కాల్స్‌కు సమాధానం చెప్పారు. ఇందులో ఒకటవ జోన్‌కు సంబంధించి మూడు, రెండవ జోన్‌కు సంబంధించి ఒకటి, మూడవ జోన్‌కు సంబంధించి ఒకటి, ఐదవ జోన్‌కు సంబంధించి రెండు, ఆరవ జోన్‌కు సంబం ధించి నాలుగు ఫిర్యాదులు అందాయి. సంబం ధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి మూడు రోజులులోగా నివేదిక సమర్పిం చాలని కోరారు.

## జివిఎంసి గ్రీవెన్సుకు 119 పిర్యాదులు



విశాఖపట్నం: జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్సుడేలో మొత్తం 119 ఫిర్యాదులు అందాయి. అదనపు కమిషనర్ (జనరల్) జివివియస్ మూర్తి ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందిన మొత్తం 119 పిర్యాదులలో ప్రధాన కార్యాలయానికి సంబంధించి 26 ఫిర్యాదులు అందాయి. ఒకటవ జోన్‌కు సంబంధించి 5, నాలుగవ జోన్‌కు సంబంధించి 8, ఐదవ జోన్‌కు సంబంధించి 62, ఆరవ జోన్‌కు సంబంధించి 18 ఫిర్యాదులందాయి. వీటిలో టౌన్‌ప్లానింగ్ విభాగంకు సంబంధించి 23, ప్రజారోగ్యవిభాగానికి సంబంధించి 9, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 41, యుసిడి విభాగానికి సంబంధించి నాలుగు, డిప్యూటి కమిషనర్ రెవిన్యూ విభాగంకు 25, ఇతరులకు సంబంధించి 17 పిర్యాదులు అందాయి.

# పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

వైకాపా నగర యువజన అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ డిమాండ్



విశాఖ సిటీః పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైకాపా నగర యువజన అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలో ఆశీలుమెట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నగర వైసీపీ అధ్యక్షుడు మళ్ల విజయ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఈ నిరసన కార్యక్రమంలో వినూత్నంగా మళ్ల విజయ్ ప్రసాద్ కొండా రాజీవ్ గాంధీ కోలా గురువులు తాళ్లతో ఇన్నోవా వాహనాన్ని లాక్కెళ్లాగా మిగతా పార్టీ శ్రేణులు అంతా దివాచక్ర వాహనాలని తోసుకుంటా ఆశీలిమెట్ట నుండి జైలు రోడ్డు కూడలి వరకు నిరసన ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో కొండా రాజీవ్ గాంధీ మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ ధరలను రోజు వారి మార్పు పద్ధతి రద్దు చేసి 15 రోజులకి ఒక్కసారి మార్పు జరిగేలా పాత పద్ధతినే అమలులోకి తీసుకురావాలని అలానే పెట్రోల్ డీజిల్ ని జి.ఎస్.టి పరిధిలోకి తీసుకురావాలని వీటితోపాటు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మన పక్క రాష్ట్రాలు కంటే పెట్రోల్ డీజిల్ 4 నుండి 6 ఎక్కువగా ఉందని ఆ అదనపు భారం ప్రజలపై పడకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శులు మాసిపోగు రాజు , కనకాల ఈశ్వర్, తుళ్ళి చంద్రశేఖర్ యాదవ్ దక్షిణ నియోజకవర్గం అధికార ప్రతినిధి గుత్తుల నాగభూషణం, మైనార్టీ నాయకుడు ముజీఫ్ ఖాన్, వార్డు యువజన అధ్యక్షుడు నోళ్లు చంటి , భాను, యువజన నాయకులు మద్ది రాజశేఖర్ రెడ్డి, విశేష్ ,సీతారెడ్డి, ప్రధాన శెత్రు, శ్రీను రెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రక్త దానం చేయండి పునర్జన్మనివ్వండి

అనకాపల్లిః ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం అందించి ప్రాణాలు కాపాడటంలో యువత ముందుకు రావాలని, వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ కె. సత్యవతి కోరారు. పట్టణంలో గల కెమిస్టు, డ్రగ్గిస్టు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక చినవీధి, ముప్పన సిల్క్ హౌస్ కాంప్లెక్స్‌లో జరిగింది. ఈ సందర్బంగా ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఎంతోమంది మహానీయులు రక్తదానం చేయటం వలన, అనేక వేలమంది, ప్రాణా పాయ స్థితి నుండి, సరి అయిన సమయంలో వారికి సరిపడ్డ, గ్రూపు రక్తాన్ని ఎక్కించడం ద్వారా అనేక మంధి ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడ్డారని, ఆమె సంతోషం వ్యక్తం చేసారు.

రక్తదానం చేయడం వలన, యువత మరింత ఆరోగ్యవంతులుగా, ఎదుగుతారని అన్నారు. రక్తదానం అన్నది ప్రతీ ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా తీసుకుని, ముందుకు రావాలని, ఆమె అన్నారు. ఔషద నియంత్రణ పరిపాలన శాఖ సహాయ సంచారకురాలు, కె. రజిత, మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అనేక స్వచ్ఛంద సంస్దలు, రక్తధాన శిభిరాలు ఏర్పాటు చేసి, రక్తాన్ని ధానంగా చేయడం, ఆమె కొనియాడారు. కోట్లకు అదిపతి అయిన మనిషి శరీరం ద్వారా రక్తాన్ని తయారు చేసుకోవాలే గాని, కొనుక్కుంటే దొరికే వస్తువు కాదు, అత్యవసర పరిస్థితుల్లో బ్లడ్ బ్యాంకుల ద్వారా ఆ రక్తం రోగులకు అందుతుందని, ఇదంతా రక్తదాతలు మహానీయులు ఇచ్చిన పునర్‌జన్మ గానే భావించాలని అన్నారు. మానవత దృక్పదంతో రక్తదాన కార్యక్రమాలకు యువత ముందుకు రావాలని ఆమె అన్నారు. విశాఖ లైన్స్ రక్తధాన శిభిరం నిర్వాహణలో జరిగిన కార్యక్రమంలో సుమారు 91 మంది, యువకులు రక్తదానం చేసారు.

సంఘ అధ్యక్షులు వంకాల ఈశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి పెతకంశెట్టి శివ వెంకటరావు, కోశాధికారి కోడూరు త్రినాధరావు, చైర్మన్ కెపివిఎన్ రామలింగేశ్వర స్వామి కన్వినర్ల్ ఎన్ఎస్ ప్రకాష్ గుప్త, వై. పరమేశ్వరరావు, నెల్లూరు శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సమావేశం

ఎం ఎస్ ఓ తాతారావు

కొత్తపల్లి: మండలం రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ సమావేశంలో ఎం ఎస్ ఓ తాతారావు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న నిత్యవసర వస్తువులు బియ్యం, పంచదార, కందిపప్పు, ఇవేకాక ప్రభుత్వం దంపుడు బియ్యం, రాగులు రేషన్ ద్వారా ప్రజలకు అందజేస్తే ఎంతవరకు మేలు జరుగుతుందనే దానిపై రేషన్ డీలర్లు ప్రజా సేకరణ చేసి ఎంతమేరకు ప్రజలకు ఈ 2 వస్తువులు అందజేయడంలో ఎంతవరకు పొందుతారు అనే అనేదానిపై సర్వే చేసి ప్రజాభిప్రాయాన్ని తెలియపరచాలని తాతా రావు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మండలం రేషన్ డీలర్ల ప్రెసిడెంట్ పాపారావు కొత్తపల్లి మండలంలో 52 మంది రేషన్ డీలర్లు పాల్గొనారు

# వైభవంగా గీతం షిరిడి సాయి 4వ వార్షికోత్సవం

విశాఖ సిటీః గీతం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పుతూ నాల్గేళ్ళు క్రిందట నిర్మితమైన షిరిడి సాయి ధ్యాన మందిరం 4వ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహిం చారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో షిరిడి సాయిని దర్శించుకోవటానికి పెద్ద ఎత్తున విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బంది తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక హెూమ కార్యక్రమంలో గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాదరావు, గీతం ప్రో-వైస్‌ఛాన్సలర్ కె.శివరామకృష్ణ దంపతులు పాల్గొన్నారు. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్ధులకు విజయం కలగాలని, ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి వారు చేసే కృషి ఫలించాలని ప్రత్యేక పూజలను జరిపారు.

విద్యుత్ దీపాలు, పూల అలంకరణ మధ్య షిరిడి సాయి భక్తులను అలరించారు. వార్షికోత్సవ సందర్భంగా సాయి ప్రసాదాన్ని అన్న సంతర్పణగా భక్తులకు అందించారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు, కళాశాలల ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్, ప్రొఫెసర్ ఎస్.గణపతి, ప్రొఫెసర్ కె.అరుణలక్ష్మి, ప్రొఫెసర్ మోహన్, డాక్టర్ ఎస్.కనక లక్ష్మీ, పరిపాలన అధికారి జి.వై.నాయుడు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు రాజేంద్రప్రసాద్, గోవిందరాజులు, త్రిమూర్తులు తదితరులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

# పార్లమెంట్ నియోజకవర్గ సేవా మిత్ర శిక్షణా తరగతులు ప్రారంభం



విశాఖపట్నం: విశాఖలో పార్లమెంట్ నియోజకవర్గ సేవా మిత్ర శిక్షణా తరగతులను యంవివియస్.మూర్తి సోమవారం ప్రారంభిం చారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్న స్ఫూర్తితో నేటికీ తెలుగుదేశం పార్టీ శిక్షణా తరగతులను కొన సాగిస్తోంది. తెలుగుదేశం పార్టీలో వున్న ప్రతీ కార్యకర్త క్రమశిక్షణతో ముందుకు కొనసాగుతున్నారంటే నాటి నుండి నేటి వరకు ఈ శిక్షణా శిబిరాల్లో శిక్షణను వివిధ పార్టీల్లో పూర్తి చేసుకన్న కార్యకర్తలే క్రీయాశీలకంగా వున్నారు. ఈ రోజు తెలుగుదేశం పార్టీలో వున్న ప్రతీ కార్యకర్త క్రమశిక్షణా సభ్యతా సంస్కారాలతో ముం దుకు కొనసాగుతున్నారంటే అందుకు కారణం వారు తెలుగుదేశం పార్టీ నుంచి పొందిన క్రమశిక్షణే ముఖ్యం.

ప్రతీ కార్యకర్త వచ్చే ఎన్నికల్లో తమ భుజ స్కంధాలపై పార్టీకి లేని క్యాడర్‌ను మోస్తుండ డంపై ప్రధాన దృష్టిని కేంద్రీతకరించాల్సి వుంది. రాష్ట్ర ప్రోగ్రాం కమిటీ సభ్యులు మరియు రాష్ట్ర పార్టీ కార్యనిర్వహక కార్యదర్శిఎోలుదాసు కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పార్టీ విధి విధానాలను వివరించారు.

రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి సభ్యులు మరియు ఉత్తరాంధ్ర నాయకత్వ శిక్షణా శిబిరం డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడు తూ సేవామిత్ర శిక్షణా తరగతులు రానున్న 2019 సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల్లో విజయదుందుంభి మ్రోగించడానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు.

ఎమ్మెల్సీ డాక్టర్ ఎంవివిఎస్ మూర్తి, శిక్షణా తరగతుల డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు, రాష్ట్ర పార్టీ కార్యనిర్వహక కార్యదర్శిఎోలుదాసు కృష్ణమూర్తి, మాజీ కార్పొరేటర్ ఆళ్ళ శ్రీనువాసు, శిక్షణా తరగతుల నిర్వాహకులు పాల్గొన్నారు.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

ప్రకటన నెం. eT-SrDME-WAT-63-2018

పని పేరు: విశాఖపట్నం కోచింగ్ డిపో యొక్క పాంట్రీ కార్లులోని LPG ఇన్‌స్టలేషన్స్ కొరకు నిర్వహణ మరియు రౌండ్ ట్రిప్ సేఫ్ రన్ సర్టిఫికెట్ జారీ.

సుమారు పని విలువ: ₹ 13,91,378/-, బయానా: ₹ 27,830/-, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ 2,360/-, పని పూర్తి చేయు కాలం: 24 నెలలు.

టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 19.07.2018న 1500 గంటలకు.

ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికీ అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించబడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు http://www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి పిదైన మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 10 రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయమైనది.

సీనియర్ కోచింగ్ డిపో ఆఫీసర్, విశాఖపట్నం

PR-161/J/18-19

# విజయభాను సంపాదకీయం

## శాంతి కపోతంపై తూటా!

కశ్మీర్‌లో శాంతి స్థాపనకు అనుకూలంగా లోయలో పలు సమావేశాలను నిర్వహించడంలో బుఖారి వంటి పాత్రికేయులు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ బలహీనమైన పరిస్థితే తీవ్రవాదులను హింసోన్మాదం వైపు నెట్టింది. కాల్పుల విరమణను భంగపరిచి, శాంతికాముకులైన మేధావులను, రాజకీయ నాయకులను భయోత్పాతానికి గురిచేయాలనే ఉద్దేశంతో బుఖారిని బలిగొన్నారు. బుఖారి హత్య రాజకీయ, మేధోవర్గాల్లో కొంత ఆందోళన కలిగించింది. అయినప్పటికీ తీవ్రవాదుల బలహీనత కూడా దీనిద్వారా వెల్లడైంది. కశ్మీర్‌లో శాంతిని కాంక్షించిన కలం యోధుడు షుజాత్ బుఖారిని హతమార్చడం ఉగ్రవాదుల హింసోన్మాదానికి, పిరికితనానికి నిదర్శనం. రైజింగ్ కశ్మీర్ సంపాదకుడైన షుజాత్ బుఖారి కశ్మీరీ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకి కాదు. కశ్మీరీల ప్రయోజనాల కోసం అహరహం తపించే మేధావుల్లో ఆయన ముందుంటారు. కశ్మీర్ పరిస్థితిని వివరించగల అగ్రశ్రేణి పాత్రికేయునిగా ఆయన అంతర్జాతీయ గుర్తింపు పొందారు. ఆయన కలం ద్వారా తన భావాలను వ్యక్తం చేశారే తప్ప, తూటాలను ఏనాడూ నమ్ముకోలేదు. సుందర కశ్మీర్ ఇప్పుడొక యుద్ధభూమిని తలపిస్తున్నది. పాకిస్థాన్ ప్రేరేపిత వేర్పాటువాదులు మొదలుకొని, భారత్‌లో అంతర్భాగంగా కశ్మీర్‌కు అచ్చమైన స్వయం ప్రతిపత్తి కల్పించాలనే వారు కూడా ఉన్నారు. వీరంతా కేం ద్ర ప్రభుత్వ విధానాలతో విభేదిస్తున్నవారు. కేంద్ర విధానాలతో స్థూలంగా ఏకీభావం ఉన్న రాజకీయ శక్తుల్లో కూడా మోదీ, ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ పాలనా సరళిని వ్యతిరేకిం చే వర్గాలున్నాయి. మితవాది అయిన షుజాత్ బుఖారి భారత రాజ్యాంగం పరిధిలోనే కశ్మీరీ ల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ద ృఢంగా నమ్మారు. అయినప్పటికీ కశ్మీరీల నమ్మకాన్ని పొందేవరకు ఏ పరిష్కారం సాధ్యం కాదని నిక్కచ్చిగా చెప్పగలిగిన పాత్రికేయుడాయన. తాను నమ్మిన భావాలకు ద ృఢంగా కట్టుబడి ఉండేవారు. కానీ భిన్న భావజాలం గల వారిపై కత్తిగట్టలేదు. బుఖారి భావజాలంతో ఎవరికైనా భిన్నాభిప్రాయాలుంటే తమ వాదనల ద్వారా తిప్పికొట్టవచ్చు. ఆయన అనుసరిస్తున్న బాటలో బలహీనతలుంటే బయటపెట్టవచ్చు. కానీ ఆయన భావజాలాన్ని చర్చల ద్వారా ఎదుర్కోలేని బలహీన మనస్కులే తూటాలతో హతమార్చారు. ఈ దారుణచర్య హింసోన్మాదాన్ని నమ్ముకొనే వారి డొల్లతనాన్ని వెల్లడిస్తున్నది. ఆయన అనుసరించిన మార్గం బలమైనదనే వాస్తవం ఉగ్రవాదులను భయపెడుతున్నది. షుజాత్ బుఖారి ప్రాణాలను ఉన్మాదులు బలిగొనడానికి గల నేపథ్యం గమనించదగినది. కశ్మీర్‌లో తీవ్రవాదం వల్ల ఒక తరమంతా తూటా ల చప్పుళ్ళ మధ్య పెరిగింది. కశ్మీర్ పరిస్థితి పట్ల ఆందోళన నెలకొన్న తరుణంలో వాజపేయి హయాంలో పరిస్థితి కుదుటపడ్డది. శాంతి ప్రక్రియ కొనసాగింది. ప్రభుత్వాలు మారినా పరిస్థితి చేజా రిపోలేదు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదట్లో కొంత కఠిన వైఖరిని ప్రదర్శించింది. 2016లో వేర్పాటువాద నాయకుడు బుర్హా న్ వాని కాల్పుల్లో మరణించిన తర్వాత కశ్మీర్‌లోయ మళ్ళా రాజుకున్నది. కశ్మీరీ యువత మళ్ళా తీవ్రవాదుల్లో చేరడం మొదలైంది. ఉగ్రవాద చర్య లు కూడా పెరిగాయి. కశ్మీర్ మళ్ళా హింసామార్గంలోకి పోతున్నదని కలవరపడిన కొందరు విద్యా వంతులు అప్రమత్తమై శాంతిని కాపాడేందు కు ప్రయత్నిస్తున్నారు. విద్యా సాంస్క ృతిక రంగాల్లో కశ్మీరీ యువత రాణించడానికి ప్రోత్సాహాన్ని ఇవ్వ డం మొదలైంది. హార్ట్స్ డాక్ట్రిన్ పేర కశ్మీర్ శాంతియుత పరివర్తనకు దోహదం చేసే చర్యలు మొదలయ్యాయి. యువతకు ఉపాధి లభించే విధంగా నైపుణ్యాలు గరుపడం, ఉద్యోగ కౌన్సిలింగ్ ఇవ్వ డం వంటి కార్యక్రమాలు సాగుతున్నాయి. సైనిక చర్యల వల్ల జనజీవనానికి అంతరాయం కలుగకుండా విద్యావంతులు సూచనలు చేశారు. సమాజంలో మంచి గుర్తింపు ఉన్న షుజాత్ బుఖారికి ఎందరో పాత్రికేయ అనుయాయులున్నారు. వీరంతా కశ్మీర్‌లో శాంతియుత మార్పునకు దోహదపడుతున్నారు. కేంద్రంలోని శాంతికాముక శక్తులతో చర్చలకు బుఖారి వారధిలా మారారు. కశ్మీర్‌లో శాంతి నెలకొంటేనే పర్యాటకమైనా, ఇతర రంగాలైనా ఉపాధినిస్తాయి. ఈ శాంతికాంక్షకు బుఖారి వంటి వారు ఆచరణరూపం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం కశ్మీర్ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలనే ధోరణిని ఇటీవలి కాలంలో ప్రదర్శించింది. కశ్మీర్‌లోని భిన్నవర్గాలతో చర్చించడానికి ఇంటలిజెన్స్ బ్యూరో (ఐబీ) మాజీ డైరెక్టర్ దినేశ్వర్ శర్మను తమ దూతగా పంపించింది. వేర్పాటువాదులతో కూడా చర్చించడానికి సిద్ధమని ప్రకటించింది. కొందరు వేర్పాటువాద నాయకులతో తెరవెనుక మంతనాలు కూడా జరిగాయి. రంజాన్ సందర్భంగా కాల్పుల విరమణ పాటించడం కూడా ఈ వ్యూహంలో భాగమే.

## అర్హులైన పేదలందరికి కనీస సౌకర్యాలు కల్పించాలి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రోలుగుంట : అర్హులైన పేదలందరికి కనీస సౌకర్యాలైన రేషన్ కార్డు, రక్షిత మంచినీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించాలని, అటవీ బంజరు భూముల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సామూహిక దర ఖాస్తుల సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ పెంటకోట అప్పల నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, రేషన్ కార్డులు, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. పేదలందరికి రూ.3వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. జన్మభూమి కమిటీలను రద్దు చేయాలన్నారు. పేదల స్వాధీనంలో ఉన్న ఇళ్ల స్థలాలకు సాగు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు గోలకొండ నూకినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా



ఆందోళన చేస్తున్న సిపిఐ నాయకులు

గొలుగొండ : నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పక్కా ఇళ్లు, వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పెన్షన్లు, పోడు భూములకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ గొలుగొండ మండల సమితి ఆధ్వర్యంలో గొలుగొండ తహశీల్దార్ కార్యాలయ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రభుత్వమే అందించాలన్నారు. ఈ కార్య క్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాకిరెడ్డి రాము నాయుడు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి మేకా సత్యనారాయణ, సిపిఐ మండల కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కుమార విజయం.. అద్భుతం



బెంగళూరు : జనతాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి మరోమారు ముఖ్యమంత్రి అయిన నేపథ్యంలో సువర్ణ కర్ణాటక ఒక్కలిగర హిత రక్షణ వేదికె పథాధికారులు ఆదివారం వేడుకలను నిర్వహించారు. ఈ విజయం అపూర్వ ఘట్టంగా పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి దేవేగౌడ 86వ పుట్టిన రోజు వేడుకల కొనసాగింపునకూ ఈ ఘట్టం వేదికగా నిలచింది. పద్మనాభనగరలోని దేవేగౌడ నివాసానికి సంఘం పథాధికారులు ఆదివారం భారీ కేక్ తీసుకువెళ్లి సంబరాలు ప్రారంభించారు. దేవేగౌడ స్వయంగా కేక్ కోసి, సంఘం పథాధికారులకు పంచి పెట్టారు.

పలు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించారు. కుమారస్వామి పాలన జనరంజకం కావాలని ఆకాంక్షించారు.

## వేడుకగా తండ్రుల దినోత్సవం

బ్రహ్మపుర : నాన్నే నా హీరో..నా మార్గదర్శి.. నా మిత్రుడు.. ఇలా నాన్న కోసం వారి మనసులోని మాటలను చిన్నారులు వెలిబుచ్చారు.

తండ్రుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఫ్రెండ్స్ హెల్పింగ్ క్లబ్(ఎఫ్‌హెచ్‌సీ) ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఉదయం స్థానిక గజపతి కూడలిలోని స్నేహం ఆవరణలో జరిగిన వేడుకల్లో శిశు వైద్య నిపుణుడు టి.ప్రకాశరావు సుమారు 24 మంది చిన్నారులకు ధ్రువపత్రాలు, బహు మతులు అందజేశారు. ఎఫ్‌హెచ్‌సీ అధ్యక్షుడు కె.పురుషోత్తం కుమార్ సుబుద్ధి, ఇతర ప్రతినిధులు మనోజ్ పాఢి, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

సిమిలిగుడ : మూడు రోజుల పాటు ఆటపాటలు, హుషారైన కార్యక్రమాలు, నోరూరించే వంటకాలు, పసందైన పాన్‌లు, ఉయ్యాలలూగే సరదాలతో సాగిన రొజ్జో వేడుకలు ఘనంగా ముగిశాయి. రాత్రి వరకూ సాగిన కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలకు కౌన్సిలరు రవీంద్ర ప్రధాన్ బహుమతులను అందజేశారు. సునాబెడ హాల్ టౌన్‌షిప్‌లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు ముగిశాయి. సిమిలిగుడకు చెందిన నిష్టా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా సీతామ్ కళాశాల ఛైర్మన్ కృష్ణసింగ్, అతిథులుగా బ్రహ్మకుమారి, సిమిలిగుడ శాఖ నిర్వాహకురాలు సావిత్రి, ఉపాధ్యాయిని సరళా బెహర, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు అజయ్ సాహులు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు.

## సమకవి సమయం

### 'ఆటోవాలా'

'ఆటోవాలా!... ఆటోవాలా!'
గుండె ఖలేజా ఉండేవాడా!
అసలు - సిసలు హీరోగా బ్రతకాలనుకునేవాడా!
నీ భుజ స్కంధాలపై బ్రతికేవాళ్లు
పెట్రోల్ బంక్, మెకానిక్స్, టింకర్స్, ఎలక్ట్రికల్స్
పెయింటర్స్॥ మొ॥ నీ కుటుంబీకులే కదయ్యా॥ ...॥ఆటో॥
క్షణం, క్షణం, భయం, భయం ఇంటా-బైట
గుండె దడలు కొట్టినా!
నీ ప్రయాణం నిరంతరం సాగించెవాడా!
నీ ప్రయాణీకులను సుస్థిర స్థానాలకు చేర్చేవాడా! ...॥ఆటో॥
ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ నీ ప్రయాణం సాగించినా!
ఇక్కడెందుకు ఆపావు... అక్కడెందుకు ఆపావు
ఆటో తాళం చెవిని తీసుకొనిపోయి
ఆటోని తీసుకురా... రా!అన్న
రహదారుల - రక్షదళాల ఆగడాల రాజ్యంలో
ఆకాశం మీద నడ్పమంటావా! అనలేక
హాం యాం సమర్పించెవాడా! ...॥ఆటో॥
దళాలుగా మారితే
వీళ్లకు పెంచెందుకే ఆటోలు పుట్టాయని
చావలేక, బ్రతకలేక, దిన, దిన గండంగా బ్రతికేవాడా!
అక్షరాలు రాని వాడికి ఎం ఉద్యోగమొస్తుందని
ఆటోని నడ్పుకుంటే - ఆకాంక్షలు ఎక్కువే!
లక్షలు జల్లి - చిల్లర వేరుకుంటుంటే;
వీర ముష్టికి బలియైనోడా! ...॥ఆటో॥
చావడానికైనా ఖలేజా ఉండాలిగా
ఫైనాన్స్ కట్టలేక ఆత్మహత్యలకు బలియైనోడా!
బస్సులో జనాలు వ్రేలాడుతూ వెళ్తుంటే;
ఎం చూస్తుంది - ఎం చేస్తుంది
ఈ రహదారులు- రక్ష దళాధిపతుల లోకం
ఏమిటో వ్యవస్థ... ఏమిటీ అవస్థ అంటుందీ లోకం
పిచ్చుకులపై బ్రహ్మాస్త్రం ప్రయోగించే
రక్ష దళాలను చూసేనే; కచ్చల ఉచ్చ పోసుకొనే
యువతకు బ్రతుకు ధైర్యం- ప్రోత్సాహానిచ్చెదెవరని?
ఎవడెలా పోతేం - నా సంపాదనే నాకు ముఖ్యమన్న
రక్షక దళాల లోకంలో;
నీ లాంటి ఆటోలు మూగబోవునప్పుడు
జన జీవనం స్థంబించునప్పుడే! ...॥ఆటో॥

...కవితా రచన
యల్.సిద్ధూ
సెల్ నెం: 7702977293

## పంచాంగం


మాసం : నిజ జ్యేష్ట ; తిథి : షష్టి ఉ.11.52; మఖ ఉ.8.06; మ.వ.3.41ల 5.12.

మంగళవారం 19-06-2018

a **మేషం** :మీ ఔదార్యాన్ని కొంతమంది దుర్వినియోగం చేసే అవకాశం ఉంది. ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. అందరికీ సహాయం చేసి మాటపడతారు. దైవ, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. b **వృషభం** : చిరు వ్యాపారులకు లాభదాయకం. ఉద్యోగస్తులకు పై అధికారుల వల్ల ఒత్తిడి, చికాకులు తప్పవు. ఏవైనా చిన్న చిన్న సమస్యలు తలెత్తినా తాత్కాలికమేనని గ్రహించండి. ప్లీడర్లకు, ప్లీడరు గుమాస్తాలకు సత్కా లం. C **మిథునం** : స్త్రీల ఏమరుపాటుతనం వల్ల విలువైన వస్తువులు చేజార్చు కునే అవ కాశం ఉంది. పాతరుణాలు తీర్చడంతో పాటు విలువైన పరికరాలు అమర్చు కుంటారు. d **కర్కాటకం** : విదేశీ వస్తువులపట్ల ఆకర్షితులవుతారు. మీరు ఊహించిన దానికంటే అధికంగా వ్యయం అవుతుంది. స్త్రీలకు, కళ్ళు, తల, నరాలకు సంబంధించిన చికాకులను ఎదుర్కొంటారు. రాజకీయనాయకులు సభలు, సమావేశాలు, బృంద కార్యక్రమాల్లో పాల్గొంటారు. e **సింహం** : కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల వ్యవహారాలు పునరాలోచన అవసరం. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. పెద్దల ఆరోగ్యంలో మెళకువ అవసరం. వాతావరణంలోని మార్పు రైతులకు ఆందోళన కలిగిస్తుంది. f **కన్య** :. మీకు రాబోయే ఆదాయానికి తగినట్లుగా ఖర్చులు సిద్ధమవుతాయి. వైద్య, ఇంజనీరింగ్ రంగాల్లో వారికి ఒత్తిడి పెరుగుతుంది. ప్రేమికుల మధ్య అనుమానాలు తొలగిపోతాయి. రవాణా రంగంలోని వారికి చికాకులు అధికమవుతాయి. g **తుల** : మీకు నచ్చని సంఘ టనలు కొన్ని ఎదురుకావచ్చు. స్త్రీల అభిప్రాయాలకు వ్యతిరేకత ఎదురవుతుంది. h **వృశ్చికం** : విద్యార్థులకు ధ్యేయం పట్ల ఏకాగ్రత, పరిస్థితుల అనుకూలతలు ఉంటాయి. రాజకీయ పారిశ్రామిక రంగాల వారికి అనూహ్యమైన అవకాశాలు దక్కు తాయి. i **ధనుస్సు** : రావలసిన మొండి బాకీలు ఆలస్యమైన కానీ వసూల వుతాయి. ఆత్మీయులతో ఉల్లాసం గడుపు తారు. j **మకరం** : బ్యాంకు వ్యవహారాల్లో మెళకువ అవసరం. పత్రికా రంగంలోని వారికి నిరుత్సాహం తప్పదు. బంధువులను కలుసుకుంటారు. k **కుంభం** : క్యాటరింగ్ రంగాల్లో వారికి పురోభివృద్ధి. స్త్రీలకు ఇరుగు పొరుగు వారితో సఖ్యత అంతంగా ఉండదు. L **మీనం** : మీ ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. కోర్టు కేసులు పరిష్కారమవుతాయి. ఇతరుల కుటుంబ విషయాల్లో తలదూర్చి తెచ్చుకోకండి.

## హయగ్రీవావతారం

### సంకీర్తన



సకల చరాచర సృష్టికి కర్త అయిన బ్రహ్మకు శక్తిని ఇచ్చేవి వేదాలే, ఆ వేదాల సంరక్షణలో నిరంతరం మహావిష్ణువు నిమగ్నమై ఉంటాడని, విష్ణుతత్వ మహత్యాన్ని, వేద విజ్ఞాన ఔన్నత్యాన్ని గురించి ఈ కథ తెలియజేస్తుంది. శ్రీ మహావిష్ణువు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం ఎన్నో విధాలుగా ఎన్నెన్నో సందర్భాల్లో అవతరించాడు. తేజోవంతమైన రూపంతో ఆయన హయగ్రీవావతారం పొంది వేదాలను రక్షించాడు. కేవలం వేదోద్ధరణ లక్ష్యంగా హయగ్రీవావతారం కనిపిస్తుంది. పూర్వం శ్రీ మహావిష్ణువు నాభికమలంలో ఆసీనుడై ఉన్న సృష్టికర్త బ్రహ్మ తన పనిలో తాను నిమగ్నమై ఉండగా మధుకైటభులు అనే ఇద్దరు రాక్షసులు గదలను ధరించి మెల్లగా బ్రహ్మదగ్గరకు చేరి మనోహర రూపాలతో భాసిల్లుతున్న నాలుగు వేదాలను అపహరించారు. బ్రహ్మ చూస్తుండగానే అపహరించిన వేదాలతో ఆ దానవులు సముద్రంలో ప్రవేశించి రసాతలానికి చేరారు. వేదాలను కోల్పోయిన బ్రహ్మ వేదాలే తనకు ఉత్తమ నేత్రాలని, వేదాలే తనకు ఆశ్రయాలని, వేదాలే తనకు ముఖ్య ఉపస్యాలని అవి లేకపోతే తాను సృష్టిని చేయడం కుదరదని విచారిస్తూ ఆ ఆపద నుంచి ఎలా బయటపడాలా అని ఆలోచించసాగాడు. ఆయనకు వెంటనే శ్రీమహావిష్ణువు గుర్తుకు వచ్చి పరిపరివిధాల స్తుతించాడు. బ్రహ్మ ఆవేదనను శ్రీహరి గ్రహించి వేద సంరక్షణ కోసం యోగ రూపంతో ఒక దివ్యశరీరాన్ని పొందాడు. ఆ శరీరం చంద్రుడిలా ప్రకాశించ సాగింది. ఆ శరీరమే హయగ్రీవ అవతారం అయింది. నక్షత్రాలతో నిండిన ఆకాశం ఆయన శిరస్సుగా మారింది. సూర్యకిరణ కాంతితో ఆయన కేశాలు మెరవసాగాయి. ఆకాశం పాతాళం రెండు చెవులుగా, భూమి లలాటభాగంగా, గంగా సరస్వతులు పిరుదులుగా, సముద్రాలు కనుబొమ్మలుగా, సూర్యచంద్రులు కన్నులుగా, సంధ్య నాసికగా, ఓంకారమే ఆయనకు అలంకారంగా, విద్యుత్తు నాలుకగా, పితృదేవతలు దంతాలుగా, గోలోకం బ్రహ్మలోకం రెండు పెదవులుగా, తమోమయమైన కాళరాత్రి ఆయనకు మెడభాగంగా అలరారాయి. ఈ విధమైన ఒక దివ్యరూపాన్ని ధరించిన శ్రీహరి హయగ్రీవావతారం బ్రహ్మ ముందు నుంచి అంతర్ధానమై రసాతలానికి ప్రవేశించింది. అక్కడ హయగ్రీవుడు ఉదాత్త, అనుదాత్త స్వరయుక్తంగా పెద్దగా సామవేదాన్ని గానం చేయసాగాడు. ఆ గానరసం రసాతలంలో వేదాలను దొంగిలించి దాక్కున్న రాక్షసుల చెవులకు కూడా సోకింది. ఆ గాన రసవాహినికి ఆ రాక్షసులిద్దరు పరవశించి బ్రహ్మ దగ్గర నుంచి తాము తెచ్చిన వేదాలను ఒక చోట భద్రం చేసి గానం వినిపించిన దిక్కుకు పరుగులు తీశారు. అయితే ఇంతలో హయగ్రీవుడు రాక్షసులు దాచిన వేదాలను తీసుకొని సముద్ర గర్భం నుంచి బయటకు వచ్చి అక్కడ ఈశాన్యభాగంలో హయగ్రీవరూపాన్ని విడిచి తన స్వరూపాన్ని పొందాడు. రాక్షసులు గానం వినిపించిన దిక్కుకు బయలుదేరి వెళ్లి ఎంత వెతికినా, ఎక్కడ వెతికినా ఎవరూ కనిపించలేదు. వెంటనే తమ వేదాలను దాచి ఉంచిన ప్రదేశానికి వెళ్లి చూశారు. అక్కడ వేదాలు కనిపించలేదు. వెంటనే ఆ ఇద్దరూ రసాతలం నుంచి వెలుపలికి వచ్చి సముద్రంలో దివ్యతేజ కాంతి పుంజంలాగా ఉండి ఆదిశేషుడి మీద యోగ నిద్రాముద్రలో ఉన్న శ్రీమహావిష్ణువును చూశారు. ఆ రాక్షసులు తాము దాచిన వేదాలను అపహరించింది ఆ శ్వేతపురుషుడేనని, తమ దగ్గర నుంచి వేదాలను తెచ్చినది కాక ఏమీ తెలియనట్లు నిద్రిస్తున్నాడని కోపగించుకొని శ్రీమహావిష్ణువు మీదకు యుద్ధానికి వెళ్లారు. అప్పుడు విష్ణువు ఆ రాక్షసులతో యుద్ధం చేసి వారిని సంహరించాడు. ఇలా హయగ్రీవావతారం వేదోద్ధరణ లక్ష్యంగా అవతరించింది.

రోజుకి రూ. 25 మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# చంద్రన్నభీమా పరిహారం పంపిణీ



భీమునిపట్నం : స్థానిక 16వవార్డులో మృతి చెందిన ఈర్ని నాగేశ్వరరావు కుమార్తె తేజకు చంద్రన్నభీమా తక్షణ సహాయం రూ.5 వేల రూపాయలు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త సీ.హెచ్. విజయ్ బాబు అందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటానూకరాజు, కార్యదర్శి గొలగాని నరేంద్ర, నాయకులు అప్పికొండ అప్పలనాయుడు, పెంటపిల్లి యోగీశ్వర్రావు,కనకల అప్పలనాయుడు,గిడుతూరి శ్రీనివాసరావు ,,మారోజు సంజీవ్ కుమార్, కె.అప్పన్న, మురళి, జి.పోలిరాజు,సూర్యనారాయణ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తగరపువలస జోన్ 5వవార్డులో మృతి చెందిన కాళ్ళ వెంకటరమణ కుటుంభానికి చంద్రన్నభీమా తక్షణ సహాయం రూ.5 వేల రూపాయలు తగరపువలస డివిజన్ టీడీపీ అధ్యక్షులు కొప్పల రమేష్,సరగడ నరసింగరావు,జీరు ఆదిబాబురెడ్డి,రవ్వ వెంకటరావు, తమ్మిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసా పత్రాలు



విజయనగరం : జిల్లా ఎస్. కోట పోలీసు స్టేషను కేసులో ఒక మైనరు బాలికను ప్రేమ పేరుతో మోసగించి, పెండ్లి చేసుకోవడానికి నిరాకరించిన కేసులో కోర్టు నిందితుడికి పదేళ్ళు శిక్ష విధించుటలో సమర్ధవంతంగా పనిచేసి, సఫలీకృతులు అయిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ జి. పాలరాజు తన కార్యాలయంలో సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. కేసు వివరాల్లోకి వెళ్లితే... డెంకాడ మండలం అయినాడ గ్రామానికి చెందిన గొడ్డు అనిల్ కుమార్ ఎస్. కోటలో ఉంటున్న తన సోదరి ఇంటి వద్ద ఉంటూ, తన సోదరి ఇంటికి ట్యూషనుకు వచ్చే బాధితురాలుని అనిల్ కుమార్‌తో లోబర్చుకున్నాడు. బాధితురాలు మైనరు బాలిక అయినప్పటికీ ఆమెను ప్రేమ పేరుతో మోసగించి, శారీరకంగా అనుభవించి, తదుపరి పెండ్లికి నిరాకరించడంతో బాధితురాలు 2016లో ఎస్. కోట పోలీసులును ఆశ్రయించింది. ఎస్. కోట పోలీసులు నిందితుడు గొడ్డు అనిల్ కుమార్‌పై అప్పటి ఎస్ఐ కె. రవికుమార్ కేసు నమోదు చేయగా, అప్పడి విజయనగరం డిఎస్పీ కె. కృష్ణ ప్రశాంతి దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేసినారు. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై. పరశురాం పోలీసులు సమర్పించిన సాక్ష్యాలను ప్రాసిక్యూషన్‌లో సరైన సాక్ష్యాధారాలతో కేసు రుజువు చేయడంతో జిల్లా అదనపు న్యాయమూర్తి వర ప్రసాద్ నిందితుడు గొడ్డు అనిల్ కుమార్‌కు పది సంవత్సరాలకఠిన కారాగార శిక్షతో పాటు 11 వేల రూపాయిల జరిమానా విధించారు. ఈ కేసులో నిందితుడు శిక్షింపబడుటలో క్రియాశీలక పాత్ర పోషించిన ఎస్. కోట ఎస్ఐ ఎస్. అమ్మినాయుడు, కోర్టు లైజన్ ఆఫీసరు కృష్ణ కుమారి, ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేయుచున్న ఎఎస్ఐ టి. శ్రీహరి, ఎస్. కోట కోర్టు కానిస్టేబులు సిహెచ్. లోకనాధంలను జిల్లా ఎస్పీ తన కార్యాలయానికి పిలిపించి, వారికి ప్రశంసా పత్రాలను, పోత్సాహక నగదు బహుమతులను జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐలు వై.వి. శేషు, జి. రామకృష్ణలు పాల్గొన్నారు.

# 22న జిల్లాస్థాయి పరుగు పోటీలు



విజయనగరం : ఎలయన్స్‌క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 105 ఆధ్వర్యంలో ఈ నెల22వ తేదీన జిల్లాస్థాయి పరుగు పోటీలను నిర్వహిస్తున్నామని క్లబ్ గవర్నర్ సముద్రాల గురుప్రసాద్ అన్నారు. సోమవారం ఉదయం లార్వెన్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒలంపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 22వ తేదీ ఉదయం 9 గంటలకు లార్వెన్స్ పాఠశాలలో బాల, బాలికలకు వేర్వేరుగా 100 మీటర్ల పరుగు పందెం ఉంటుందని, 7, 8వ తరగతి విద్యార్థులు జూనియర్ విభాగంలోను, 9, 10వ తరగతి విద్యార్థులు సీనియర్ విభాగంలో పాల్గొనవచ్చునని పూర్తి వివరాలకోసం 9490462262 నెంబర్‌ను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తొలుత పోటీల ఆహ్వానప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కేబినెట్ కార్యదర్శి పిన్నింటి సూర్యనారాయణ, జోన్ ఛైర్‌పర్సన్ గోటేటి హిమబిందు, మహిళా ఛైర్‌పర్సన్ కె.విమలారాణి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రమోద తదితరులు పాల్గొన్నారు.

# మీ కోసం (ప్రజావాణి 225 దరఖాస్తులు)



విశాఖపట్నం: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం (ప్రజావాణి) కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ వినతు లను అధికారులకు సమర్పిం చారు. సోమవారం మీ కోసం కార్య క్రమానికి 225 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జాయింట్ కలెక్టర్ జి.సృజన, జేసి-2 డా.సిరి, డిఆర్ఓ చంద్ర శేఖరరెడ్డి మీ కోసం కార్య క్రమంలో పాల్గొని పలు ప్రాంతాల నుండి వచ్చిన వారి నుండి స్వయంగా వినతులను స్వీకరించారు. గృహాలు, రేషన్‌కార్డులు, భూమి వివాదాలు, పింఛన్ల మంజూరు మరియు ఇతర సమస్యలకు సంబంధించిన విజ్ఞాపనలను సమర్పించారు. మీ కోసం కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**డయల్ యువర్ కలెక్టర్‌కు 16 ఫోన్‌కాల్స్**

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో సోమవారం ఫోన్‌కాల్స్ ద్వారా బాధితులు తమ వినతులను విన్నవించుకున్నారు. జాయింట్ కలెక్టర్, సృజన ఫోన్ కాల్స్ స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ సృజన సంబంధిత శాఖల అధికారులను వారి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సముద్రం స్నానానికి వెళ్లి నలుగురు మృతి

## వెన్నెలపాలెంలో విషాధఛాయలు






పరవాడ: పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సముద్ర స్నానానికి వెళ్లిన అయిదుగురు యువకుల్లో నలుగురు యువకులు మృత్యువాత పడ్డారు. ఒక యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు.

వివరాల్లోకి వెళితే.

పదవ తరగతి పూర్వ విద్యార్థులు తిక్కవానిపాలెంలో సముద్ర తీరాన గెట్ టుగెథెర్ ఏర్పాటుచేసుకున్నారు.ఇదిలా ఉండగా సాయంత్రం సుమారు 5 గంటల ప్రాంతంలో సముద్ర స్నానానికి వెళ్లిన అయిదుగురు యువకుల్లో మహేష్, నరేష్, రామకృష్ణ , నర్సింగ్ అనే నలుగురు యువకులు అలల దాటికి మృత్యువాత పడ్డారు. ఒకరు ప్రాణాలుతో బయటపడ్డారు. ఈ విషయంపై పరవాడ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అర్హులైన వారికి ఇళ్ళస్థలాలు ఇవ్వాలని ధర్నా

భీమునిపట్నం : అర్హులైన వారికి ఇళ్ళు, ఇళ్ళస్థలాలు, రేషన్ కార్డులు,పెన్షన్లు ఇవ్వాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు అల్లు బాబూరావు ఆద్వర్యంలో స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలోసోమవారం ధరఖాస్తులు సమర్పించారు.

ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఇళ్ళు లేని పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తానని హామీ ఇచ్చారు. కాని ఇంతవరకు ఇళ్ళ గాని ఇళ్ళస్థలాలు ఇవ్వలేదని అన్నారు. 5ఏళ్ళు పదవికి గాను నాలుగేళ్ళు హారతి కర్పూరం లా కరిగి పోయిందని అన్నారు. జన్మభూమి లో ఇళ్ళస్థలాలు ఇస్తామని అర్హులైన పేదలు ధరఖాస్తులు పెడతే ఇంతవరకు ఆవిషయమే లేదని తెలిపారు. ఇంకా అర్హులైన వారికి ఇళ్ళస్థలాలు, రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలని, పేదల స్వాధీనం లో ఉన్న ఇళ్ళకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, జన్మభూమి కమిటీ లు రద్దు చేయాలని తదితర డిమాండ్ లతో సామూహిక ధరఖాస్తులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమర్పించారు. ఇంక ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పి.సూరిబాబు, డి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జివియంసి షాపులుపై జిఎస్టీ, అడ్వాన్స్ రుసుం తగ్గించాలని వినతి



భీమునిపట్నం : భీమిలిలో జివియంసి షాపులుపై జిఎస్టీ మరియు పెంచిన అడ్వాన్స్ రుసుము తగ్గించాలని కోరుతూ వర్తక సంఘం నాయకులు భీమిలి నియోజకవర్గ ఇన్చార్జి చిక్కాల విజయ్ బాబు వినతి పత్రం ఇచ్చారు. మంత్రివర్యులు గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భీమిలి డివిజన్ ప్రెసిడెంట్ గంటా నూకరాజు, తగరపువలస డివిజన్ టీడీపీ అధ్యక్షులు కొప్పల రమేష్, రవ్వ వెంకటరావు, గిడుతూరి శ్రీనివాసరావు, మారోజు సంజీవ్ కుమార్, వర్తక సంఘం నాయకులు యనాపు శ్రీనివాసరావు, శ్రీను, బాలాజీ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో ప్రారంభమైన కొత్త కోర్సులు

విశాఖపట్నం : దేశంలోనే ప్రప్రధమంగా ఇంధన రంగ సంబంధిత పెట్రోల్ బంక్ అటెండెంటు, ఎల్పీజీ మెకానిక్ శిక్షణ కోర్సులను ఆరిలోవలో వున్న స్కిల్ డెవలప్ మెంట్ ఇన్సిట్యూట్ లో సోమవారం నాడు ప్రారంభించారు. హెచ్ పీ సీ ఎల్ జనరల్ మేనేజరు అనురాగ్ శ్రీవాస్తవ ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు బంకులు, ఎల్పీజీ లో పనిచేస్తున్న వ్యక్తులకు సరైన అవగాహన లేకపోవడం గమనించిన కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ ప్రతి ఒక్కరు సుశిక్షితులయ్యేలా ప్రణాళిక రూపొందించినట్లు, ఈ దిశగా విశాఖలోని ఇన్సిట్యూట్ ముందడుగు వేసినట్లు తెలిపారు. క్షేత్రీయ అధిపతులైన గోపాల కృష్ణ, రవిశంకర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ ఉపాధి అవకాశాలను తెలియజేశారు.

ఈ 30 రోజుల భోజన వసతితో కూడిన ఉచిత కోర్సులలో చేరగోరే యువతీ యువకులు నేరుగా గాని, 7995014166 నంబరులో సంప్రదించి గాని రాబోయే రెండు రోజులలో నమోదు చేసు కోవాలని సంస్థ ఇంచార్జ్ సి.వి.నరసింహ దాసు కోరారు. కార్యక్రమంలో ఉన్నతోద్యోగులు, డీలర్లు, డిస్టిబ్యూటర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విశాఖ సెంట్రల్ జైల్‌లో ఖైదీలు హంగర్ స్ట్రైక్

**- పద్దెనిమిది నెలలుగా గంజాయి కేసుల్లో జైళ్లలో మగ్గుతున్న తమకు బెయిల్ మంజూరు చేయాలని ఆవేదన**

**- కోర్టులు రాజ్యాంగబద్ధంగా పనిచేయాలని వేడుకోలు**

**- తమ కుటుంబాలకు జరగరానిది జరిగితే రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి**

విశాఖపట్నం : సెంట్రల్ జైల్ లో సోమవారం నుంచి ఖైదీలు హంగర్ స్ట్రైక్ చెస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.. వివరాల్లోకి వెలితే రాష్ట్రంలో గత పద్దెనిమిది నెలలుగా గంజాయి కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న తమకు రాజ్యాంగ బద్ధంగా బెయిల్ మంజూరు చేయాల్సి ఉన్నా... సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయాలని చెప్పిన... పొరుగునే ఉన్న తెలంగాణ లో బెయిల్స్ మంజూరు చేస్తున్నా.. రాష్ట్రంలో మాత్రం రాజకీయ ఒత్తిడిలకు తలొగ్గి ఆంధ్రప్రదేశ్ లో తమకు కోర్టులు బెయిల్ మంజూరు చేయడం లేదని ఖైదీలు అందోళన వ్యక్తం చేశారు. గంజాయి కేసుల్లో రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో డబ్బై శాతం తమలాంటి కులీలు కేసుల్లో ఇరుక్కుని జైళ్లలో శిక్ష అనుభవిస్తున్నారని వాపోయారని తెలుస్తోంది. తాము చేసిన తప్పుకు తమ కుటుంబాలు రోడ్డుమీద పడ్డాయని, తమ బెయిల్స్ మంజూరు కోసం తమ కుటుంబాలు పుట్టిన చోటల్లా అప్పులు చేసి, కోర్టులు చుట్టూ తిరుగుతున్నా ఇటు బెయిల్ మంజూరు కాక అటు చేసిన అప్పులు తీర్చలేక నరక యాతన పడుతున్నాయని, తమ కుటుంబాలకు ఎమైనా జరగరానిది జరిగితే ఈ రాష్ట్ర ప్రభుత్వమే భాద్యత వహించ వలసి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారని సమాచారం. గంజాయి కేసులో అందరికి బెయిల్ మంజూరు చేసేంతవరకు జైల్ లో గంజాయి కేసులో శిక్ష అనుభవిస్తున్న వారంతా హంగర్ స్ట్రైక్ కొనసాగిస్తామని తెలిపినట్లు విశ్వసనీయ సమాచారం.

# మేము సైతం సహాయంలో ముందు ఉంటాం

తగరపువలస : మేము సైతం సహాయంలో ముందుంటామని విశాఖ వాసులు అన్నారని వుయ్ కేర్ యు ఇన్ ఛార్జ్ వెంపాడ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విశాఖ కు చెందిన పవన్ కుమార్తె కామ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా వారిజ అంధుల పాఠశాల విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నం లో ఉన్నవారు కూడా సహాయం చేయడానికి ముందు కు వస్తున్నారని తెలిపారు. అనంతరం పవన్ కు సభ్యులు కృతజ్ఞతలు చెప్పారు సభ్యుని కుమార్తె పుట్టినరోజు సందర్భంగా వుయ్ కేర్ యు సంస్థ సభ్యులు అప్పలనాయుడు కుమార్తె ప్రవళిక పుట్టిన రోజు సందర్భంగా భీమిలి నవజీవన్ అనాధాశ్రమంలో పిల్లలకు అల్పాహారం అందించినందుకు వుయ్ కేర్ సభ్యులు అప్పనాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో నవజీవన్ అనాధాశ్రమం సభ్యులు పాత్రుడు ఇన్‌ఛార్జ్ వెంపాడ శ్రీనివాస్ రెడ్డి, రాంబాబు, వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నేడు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రమాణ స్వీకారం



విశాఖపట్నం: విశాఖ నగరం అర్బన్ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన ప్రమాణ స్వీకారం మంగళవారం ఉదయం 9 గంటలకు ఆర్అండ్‌బి జంక్షన్ వద్ద అంబేద్కర్ భవన్‌లో జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు స్థానిక ఎన్ఏడి నాయి బ్రాహ్మణ కార్యాలయం నందు విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క నాయి బ్రాహ్మణుడు హాజరుకావలెనని కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు సిద్ధవటం యానాదయ్య, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు దువ్వ వరపు రామారావు, విశాఖ గౌరవ అధ్యక్షులు ఆరిపాక పెంటారావు, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి రావులకొల్లు మల్లేశ్వరరావు, రాయలసీమ ప్రధాన కార్యదర్శి యు.ఎం సుబ్బారాయుడు, రాష్ట్ర యువజన అధ్యక్షులు వెంపటాపు నూకరాజు హాజరవుతారని, ఇతర బీసీ నాయకులు నాయి బ్రాహ్మణ నాయకులు హాజరవుతారని నరవ పైడిరాజు తెలియజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కుదుళ్ల వెంకట్రావు, రాష్ట్ర కార్యదర్శి దేవగుప్తాపు రమేష్, విశాఖ సిటీ అధ్యక్షులు చల్లపల్లి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి గనిరెడ్డి సన్యాసిరావు, కోశాధికారి ఆతవ సుబ్బారావు, మల్లు వలస అప్పారావు, కోడూరు గణపతి తదితరులు పాల్గొన్నారు.

## పునాదులు పగలగొట్టకుండా

# అడ్డుపడిన గ్రామస్తులు

భీముని పట్టణము: భీమిలి నియోజకవర్గం భీమిలిమండలము సింగానబంద, కాపులుప్పడ గ్రామాల్లో 250 హౌసింగ్ ఇల్లులు శాంక్షన్ చేయగా 50ఇళ్లులు కట్టుకొని మిగతావి పునాదులు వేసిన వాటిని పడగొట్టి ఇండువిజ్యుల్ హౌస్ కడతామని పునాదులను తెలుగుదేశం ప్రభుత్వం పగులకొట్టే ప్రయత్నాన్ని గ్రామస్తులు అడ్డుకొన్నారు. వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అధ్యక్షులు తైనాల విజయకుమర్, నియోజకవర్గ కన్వీనర్ అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. గెడ్డలు చెరువులు మట్టి, ఇసుక, ఏది వదలకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు అని గ్రామస్తులు తమ గోడు జాయింట్ కలెక్టర్‌కి చెప్పుకున్నారు. విజయకుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న అవినీతికి ప్రజలు ఇబ్బందిపడుచున్నారని, న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అక్కర మాని వెంకటరావు, బోని బంగారు నాయుడు, పొట్టి రమణ, నాయకులు, గ్రామస్తులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# 20 నుంచి రెవెన్యూ గ్రామసభలు

రోలుగుంట : మండలంలో ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు 22ఎ సవరణ అభ్యంతరాలపై నోషనల్ ఖాతాలను రెగ్యులర్ ఖాతాలుగా మార్చడానికి 21 పంచాయతీల్లో రెవెన్యూ గ్రామసభలను నిర్వహించ నున్నట్లు తహశీల్దార్ అప్పలనాయుడు తెలిపారు. 20వ తేదీన కంచుగుమ్మల, కొంతలం, 21న కొమరవోలు, 22న రోలుగుంట, కుసర్లపూడి, 23న కొండపాలెం, 25న కొవ్వూరు, నిండుగొండ, 26న బుచ్చంపేట, అడ్డసరం, 27న ఎంకె.పట్నం, శరభవరం, 28న పెదపేట, కొరుప్రోలు, 29న బిజ్‌పేట, 30న అర్ల, చింతలపూడి గ్రామసభలు నిర్వహించనున్నట్టు చెప్పారు. జులై 2న గుండుబాడు, 3న జేపిఅగ్రహారం, 4న జగ్గంపేటతదితర గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయని చెప్పారు.

# సివిల్ ఇంజనీరింగ్ పట్టభద్రులకు శిక్షణ

యలమంచిలి రూరల్ : లైసెన్సు టెక్నికల్ ఇంజనీర్లు సమ్మెలో ఉన్నందున భవన నిర్మాణదారులకు ఇబ్బందులు లేకుండా సివిల్ ఇంజనీరింగ్ పట్టభద్రులకు సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమ్మె కారణంగా భవన నిర్మాణ దారులు ఇబ్బందులు పడకుండా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డిపిఒ గౌరు చెప్పారు. వీరికి ఇక్కడ డ్రాయింగ్, ఇంటి ప్లాన్‌లపై శిక్షణ ఇస్తామన్నారు. దీన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు.

**పట్టాదారు పాస్‌బుక్ పోయినది**

తూర్పు గోదావరి జిల్లా అన్నవరం గ్రామ కాపురస్తులు దాసరి సుబ్బారావు గారు అన్నవరం నుండి తుని వెళ్ళుతుండగా మార్గ మధ్యలో 174 నెంబర్ గల పట్టాదారు పాస్‌బుక్ పోయినది. ఇవి ఎవరికైనా దొరికినచో ఈ నెంబర్ సంప్రదించవలెను.

సెల్ నెంబర్ : 7013289764

# ప్రతిజ్ఞచేసిన ఉద్యోగులు




యానాం: ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవంలో ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. సోమవారం ఉదయం స్థానిక పరిపాలనాధికారి కార్యాలయంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వయోవృద్ధులను ప్రతిఒక్కరూ గౌరవించాలని పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు కార్యాల ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కార్యాల యం సూపరింటెండెంట్ పి. సూర్య నారాయణ, జి. బాలయోగి, పి. శివ, కె. ముక్తేశ్వరరావు, కె. ప్రసాద్, వి. కృష్ణమూర్తి, సుబ్రమణ్యం, సత్యం నారాయణ, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయకట్టు రైతుల ఆందోళన

తాళ్లరేవు: పోలేకూరు నుంచి బాబానగర్ వరకు ఉన్న తాగునీటి కాలువల పరిరక్షించాలంటూ ఆయకట్టు రైతులు ఆందోళన చేపట్టారు. కాలువ గట్టు వెంబడి తవ్వకం పనులను ఆయకట్టు రైతులు ఎంవివి సత్యంనారాయణరాజు, శ్రీహరిరాజు, వి. గోవరాజు, చెక్క ఆదినారాయణ, ఆర్. వీరబాబులు పరిశీలించారు. పేరులేని చెట్టు ప్రాంతంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఆక్వా చెరువులు తవ్వడంవలన కాలువ క్రింద భాగంలో తూర్లువేసి సాగునీరు అంతా చెరువులకు మళ్ళించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. చెరువులు తవ్విన ప్రదేశంలో కాలువలను లోతుగా తవ్వడంవలన శివారు ప్రాంతంలో ఉన్న భూములకు త్రాగు నీరు అందే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరు. మీటర్లు వెడల్పుగా ఉండే కాలువగట్టును ఆక్వారైతులు ఆక్రమించుకుని దానిలో రెండు మీటర్ల వెడల్పుతో మురుగు కాల్వ తవ్వుతున్నారని ఆరోపించారు. కాలువలు తవ్వుతున్న ప్రొక్లీన్‌ను రైతులు అడ్డుకున్నారు. మరో చోట కాలువ గట్టుపై నడిచివెళ్ళే అవకాశం లేకుండా చెరువులో తవ్విన మట్టిని గట్టుపై గుట్టలువేశారు. ఆక్వా చెరువులు తవ్వినప్రాంతంలోని 15 నెంబర్ పంపుపై 110 ఎకరాలు, మునిసిప్ తూముపై 30 ఎకరాలు, భూములు ఉన్నాయని రైతులు తెలిపారు. ఆక్వా చెరువుల వలన భవిష్యత్‌లో శివారు భూముల ప్రాంతాలకు సాగునీరు అందకా ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితులు నెలకొన్నాయిని వాపోయారు. జనవనరుల శాఖ అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో అందోళనకు దిగుతామని రైతులు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వందలాది ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

# బస్సు షెల్టరా? లేక షాపింగ్ మాలా?




అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం గ్రామంలో పాత బస్టాండ్ సెంటర్ దగ్గర లయన్స్ క్లబ్ వారు ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ ఆక్రమణకు గురవుతుంది అయితే ఈ సెంటర్ కి ఒక ప్రత్యేకత ఉంది.ఇటు ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానమునకు వచ్చి స్వామి వారి దర్శనం అనంతరం భక్తులు అధికసంఖ్యలో తిరుగు ప్రయాణంలో ఇక్కడికి చేరుకుని వారి గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఇక్కడకి చేరుకుంటారు.అలాగే ఈ సెంటర్ నుండి చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి కూడా కొత్తపల్లి, తొండంగి.దానవాయపేట అలాగే చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అదిక సంఖ్యలో గ్రామస్థులు ఇక్కడికి చేరుకుని వారి ప్రయాణం సాగిస్తున్నారు అయితే ఇందులో భాగంగా ఇక్కడికి చేరుకున్న భక్తులుకి గాని గ్రామస్థులుకి గాని నిలువ నీడ లేక పోవడంతో దీనిని దృష్టిలో పెట్టుకుని లయన్స్ క్లబ్ వారి ఆద్వర్యంలో ఇక్కడ బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. అయితే ఇందులో అక్కడ ఉన్న వ్యాపారస్తులు ఆక్రమణకు గురవడంతో అటు భక్తులు ఇటు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత వారం రోజులుగా భానుడు భగభగమని మండటంతో ప్రజలు, భక్తులు నిలుచోవడానికి నీడ లేక తీవ్ర ఇబ్బంది పడుచున్నారు. కావున అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా దీనిపై దృష్టి సాదించాలని పలువురు వాపోతున్నారు.

## రక్షణ కోరుతూ వివాహిత ఫిర్యాదు

కాకినాడ : కొంత మంది వ్యక్తుల వలన తనకు, తనభర్తకు, కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉన్నందున వారి నుండి రక్షణ కల్పించాలని ఓవివాహిత సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పిర్యాదు చేసింది. బాధిత వివాహిత సత్తి ఆదిలక్ష్మి అదనపు సూపరింటెండెంట్ ఎఆర్.దామోదర్‌కు వినతిపత్రం అందించింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం రావులపాలెం గ్రామానికి చెందిన తనకు వివాహం కాగా భర్త గత సంవత్సరం అనారోగ్యంతో మరణించగా తన అత్త గారి సలహా మేరకు గత ఏప్రిల్ 8న సత్తిచంద్రారెడ్డి అనే వ్యక్తిని ద్వితీయ వివాహం చేసుకున్నానని ఆ వివాహం ఇష్టంలేని రావులపాలెంకు చెందిన మల్లిడి త్రినాధ్ రెడ్డి, కర్రి తాతారెడ్డి రామచంద్రాపురం అడపావారి సావరంలో ఉండే సత్తి కృష్ణారెడ్డిలు తన భర్త చంద్రారెడ్డిని హతమార్చాలని ప్రయత్నంచేస్తున్నారని ఆరోపించారు.

# కొణతాల ప్రకటన హాస్యస్పదం

### మాజీ మంత్రి దాడి

అనకాపల్లి: మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ శారదానదిపై ఆనకట్ట నిర్మించాలని ప్రకటించడం హాస్యస్పదంగా ఉందని, శాసన మండల ప్రతిపక్ష నేత దాడి వీరభద్రరావు అన్నారు. సోమవారం వివి రమణ రైతు భారతిలో ఏర్పాటు చేసిన, విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ప్రయోజనాలను పట్టించుకోకుండా, బ్యారేజీ నిర్మాణం చేయాలని, చెప్పడం బందు ప్రీతికి నిదర్సనంగా పేర్కొనవచ్చునన్నారు. శాసన సభ్యులు పీలా గోవింద సత్యనారాయణ బంధువు కావడంతో ఆయనను వెనకేసుకు వచ్చేలా, కొణతాల రామకృష్ణ మాట్లాడుతున్నారని ఆరోపించారు. మంత్రిగా ఉన్నప్పుడు బ్యారేజీ గురించి మాట్లాడని కొణతాల ఇప్పుడు గ్యారేజీ ఆనకట్ట వలన రైతులకు మంచి జరుగుతుందని పేర్కొనడం దురదృష్టకరమన్నారు. వందేళ్లు చరిత్ర కలిగిన గ్రోయిన్లను తొలగించి బ్యారేజీ నిర్మాణం చేయథం వలన నీటి యుద్దాలు జరిగే పరిస్తితి ఉందన్నారు. నిర్మాణం జరిగే సమీప గ్రామాలు వ్యవసాయ పొలాలు, ముంపుకు గురయ్యే అవకాశం ఉందన్నారు. బ్యారేజీ బదులు గ్రోయిన్లు మరామత్తులు చేపట్టి రైతులు అందుబాటులో తీసుకురావాలని ఈ సందర్భంగా డిమాండ్ చేసారు. గతంలో స్టీల్ ప్లాంట్‌కు వీటిని తరలించినప్పుడు అఖిలపక్షాలతో అడ్డుకున్నామని, ఈ ప్రాంతానికి అవసరమైన నీరు తరలించుకుపోయేటప్పుడు కొణతాల ఎక్కడున్నారో చెప్పాలని డిమాండ్ చేసారు. ఏది ఏమైనా ఆనకట్ట నిర్మాణం చేపడితే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దాడి వీరభద్రరావుతోపాటు, గౌరీ పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు విల్లూరి రాము, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు ప్రజా రాజకీయవేదిక కన్వినర్ కనిశెట్టి సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.టి.సి బస్ స్టాండ్ ఆకస్మిక తనిఖీ

పెద్దాపురం: పెద్దాపురం పట్టణంలో నూతనంగా నిర్మించబడిన ఆర్‌టిసి బస్‌స్టాండును ఏలేశ్వరం డిపో మేనేజర్ థామస్ బాబు సోమవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రయాణీకుల విశ్రాంతి, త్రాగునీరు సదుపాయం, మరుగుదొడ్డి ఏర్పాట్లుపై పరిశీలించారు. బస్సులు సకాలంలో డిపోకి రావడం పైన, పారిశుధ్యం మొదలగు విషయాలపై డిపోలోగల ఉద్యోగిని అడిగి తెలుసుకున్నారు. వేచిఉన్న ప్రయాణికులను బస్సు ప్రయాణ సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగ్గంపేట, పెద్దాపురం బస్ స్టాండులలో బస్ సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నానని ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని థామస్ బాబు తెలిపారు.

## ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణి

పెద్దాపురం : పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 6 ఆర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ ఎస్ఎస్‌బిబి వసంతరాయుడు తెలిపారు. వీటిలో గండేపల్లి మండలానికి చెందిన ఎ. రత్నం భూమిని విచారణ చేసి న్యాయంచేయమని, తుని మండలానికి చెందిన ఎం. రాందాస్ భూమికీ సంబంధించి శాటిలైట్ సర్వేచేయించి న్యాయం చేయమని, కోటనందూరు మండలం అల్లిపూడికి చెందిన ఆర్. వెంకటేశ్వర్లు రెవెన్యూ రికార్డులో తప్పులను సరిచేయమని, పెద్దాపురంకు చెందిన కె. దేవి హౌసింగ్‌నకు సంబంధించి, దళితుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే వారిపై దర్యాప్తుచేయించాలని, ఇళ్ళులేని నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు కేటాయించాలని, బస్సు సౌకర్య కల్పించాలని ఆర్జీలు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు. ఈ ఆర్జీలు పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని తెలిపారు. ప్రతిసోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమంలో ఎమైనా శాఖా పరమైన సమస్యలు ఉంటే దీని ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

## కొత్త రేషన్ కార్డుల పంపిణీ

అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం గ్రామ పంచాయతీ ఆద్వర్యంలో గ్రామంలో అర్హులైన లబ్దిదారులకు గ్రామ సర్పంచి రాజాల.గంగాభవాణి కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాస్, తెలుగుదేశం టౌన్ అధ్యక్షుడు వీర్ల.సూరిబాబు, రాజాల.చిట్టిబాబు, బలువు.రాంబాబు, మడ్డు.వీరబాబు, ధారా.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### సముద్ర తీరంలో విషాదం

## ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి

కొత్తపల్లి: ఉప్పాడ సముద్రతీరంలో విషాదఛాయలు అలుముకున్నాయి సూరంపాలెం ఆదిత్య కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్న నైజీరియన్ విద్యార్థులు ఆదివారం కాలేజీకి సెలవు కావడంతో ఉప్పాడ సముద్రంలో స్నానాలు చేసేందుకు నైజీరియన్ విద్యార్థులు ఎనిమిది మంది వచ్చారు. సముద్ర కెరటాలు తీవ్రస్థాయిలో రావడంతో ఆరుగురు విద్యార్థులు ఒడ్డుకు చేరుకున్నారు మిగిలిన ఇద్దరులో ఒకరు మృతదేహం ఆదివారం సాయంత్రం సముద్రం ఒడ్డుకు చేరుకుంది కొత్తపల్లి ఎస్సై కృష్ణమాచారి సంఘటనా స్థలానికి చేరుకున్నారు మతదేహాన్ని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మరో విద్యార్థి మృతదేహం సోమవారం ఉదయం సముద్రం ఒడ్డుకు చేరుకుంది.

## సాగుదారులకు పట్టాలివ్వకుంటే ఆందోళన




మాకవరపాలెం : మాకవరపాలెం మండలంలోని జి.కోడూరు రెవెన్యూ పరిధిలోగల ప్రభుత్వ భూమిలో పలువురు అక్రమదారులు సాగుచేసుకుంటూ పేదలకు చెందాల్సిన భూములను అనుభవిస్తున్నారని, తక్షణమే వీరిని ఖాళీచేయించి అర్హులైన పేదలకు అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ నాయకులు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజరైన బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ జి.కోడూరు రెవెన్యూ పరిధిలోని 737 సర్వే నెంబరులో సాగులో ఉన్న పేదలకు ఇప్పటి వరకూ పట్టాలివ్వలేదన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పేదవాడికీ ఇళ్లస్థలం, పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీకి నేటికి నాలుగేళ్లు పూర్తయిందని, దీనిని తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పాలపర్తి తాతబ్బాయి, నర్సీపట్నం సిపిఐ నాయకులు ఎమ్.అప్పలరాజు, సత్యవతి, అప్పారావు, గంగరాజు, కోలా లక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు

## మూతపడిన ఇసుక ర్యాంపు - ఆగిపోయిన నిర్మాణాలు

ఆలమూరు : ఆలమూరు మండలం పరిధిలో జొన్నాడలో వున్న ఒకే ఒక ఇసుక ర్యాంపు అనేక ఒడిదుడుకుల మధ్య పలు వివాదాలతో ఒక్కొక్కసారి నాలుగు అయిదు రోజులుపాటు త్రవ్వకాలు నిలిచిపోయినా అధికారులు ప్రజాప్రతినిధులు పలుమార్లు చర్చలు జరిపి తెరిపించడం జరుగుతోంది. ఇటీవల కొన్ని రోజులుగా వున్న కొత్తపేట నియోజకవర్గ పరిధిలో వున్న ఇసుక ర్యాంపుల త్రవ్వకాలు నిలిచిపోగా జొన్నాడ ర్యాంపు ఒక్కటే త్రవ్వకాలు జరుగుతుండగా ధవళేశ్వరం బ్యారేజి నుండి నీరు విడుదల చేయడంతో ర్యాంపులోకి నీరు చేరటంతో ఈ ర్యాంపు కాస్త మూతపడింది. బొంబాయిలో ఇటీవల వర్షాలు అధికంగా కురవడంతో ఎర్రనీరు ప్రవేశిస్తుండటం, అధికారుల బ్యారేజి వద్దనున్న తెల్లనీటిని వదిలివేసినట్లు తెలుస్తోంది. ఎర్రనీరు ర్యాంపు వద్దకు వస్తే ర్యాంపు తెరవడం కష్టమేనని పలువురు అంటున్నారు. అయితే ముందుచూపుతో గ్రామాలలో రోడ్లు, భవనాలు వంటి నిర్మాణాలకు అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో కాంట్రాక్టర్లు పలుచోట్లు ఇసుక నిల్వ వేసుకున్నారు.



మాన్సూన్ బాడ్మింటన్ డబుల్స్ ఫైనల్‌లో పురుషుల డబుల్స్ టోర్నమెంట్ 2018లో విజేతగా నిలిచి స్వర్ణపతకం కైవసం చేసుకున్న ఎయూ రీసెర్చ్ స్కాలర్ శ్రీనును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎసీపీ (ట్రాఫిక్, మధురువాడ) పి.వి. కృష్ణవర్మ, పోలీస్‌ఇన్‌స్పెక్టర్ టి. సీతారాం, ఫిజికల్ ఎడ్యుకేషనల్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. విజయ్‌మోహన్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల చేతులమీదుగా ట్రోఫీని అందచేసి అభినందించారు.

# పిజీ సీట్లు కుదింపుపై విద్యార్థుల ఆందోళన

యానాం : నీట్ ప్రవేశ పరీక్షలో పుదుచ్చేరి వ్యాప్తంగా 1768 మంది అర్హత సాదించినా ప్రభుత్వ కోటా ఎంబిబిఎస్ సీట్ల సంఖ్య గణనీయం కుదించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతుంది. 2016 వరకు ఏడు ప్రైవేట్ వైద్య కళాశాలలో ఒక ప్రభుత్వ వైద్య కళాశాలలో దాదాపు 410 మెడికల్ సీట్లు ప్రభుత్వ కోటా ద్వారా వచ్చేవి గత ఏడాది 4 వైద్యకళాశాలలు డ్రీమ్స్ యూనివర్సిటీలుగా మారడంతో మిగిలిన మూడు ప్రైవేట్ వైద్య కళాశాలలు 165 సీట్లు ఇవ్వగా ఇందిరా గాంధీ ప్రభుత్వ వైద్యకళాశాలకు 127 సీట్లు ఇచ్చింది. దీంతో సీట్ల సంఖ్య 289కి తగ్గింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో మూడు ప్రైవేట్ వైద్య కళాశాలలకు 400 సీట్లు మాత్రమే కేంద్ర అనుమతించింది. దీంతో డ్రీమ్స్ వైద్య కళాశాలకు 150కి 100 సీట్లు ఉన్నాయి. దీంతో గత ఏడాది తరహాలో 160 సీట్లు కాకుండా 8 సీట్లు ఇస్తారన్న విషయంలో అనిశ్చిత నెలకొంది. పరిస్థితి ఇలా ఉండగా నిధుల కొరత కారణంగా ఇందిరా గాంధీ ప్రభుత్వ వైద్య కళాశాలో ఈ యేడాది 23 సీట్లను ఎన్‌ఆర్‌ఐ కోటాలో భర్తీచేయడానికి నిర్ణయించారు. 20 సీట్లు జాతీయ కోటాలో భర్తీచేయవలసి ఉంటుంది. దీంతో 105 సీట్లు మాత్రమే ప్రభుత్వ కోటాగా ఇచ్చే అవకాశం ఉంది.

ఈ నేపధ్యంలో ఎన్‌ఆర్‌ఐ కోటాకింది భర్తీచేసే సీట్లను పుదుచ్చేరికే పరిమితం చేయా లని విద్యార్థులతల్లిదండ్రుల సంఘ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యనఎ డిమాండఎ చేస్తున్నారు. బిపిఎలఎ కోటా కింది అభ్యర్థులకు మాత్రమే ఫీజుల రిఎంబ్రాస్‌మెంట్‌ను పరిమితంచేయాలని ప్రాంతాలవారి కోటా ఇవ్వరాదని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఏడాది యానాం నుంచి 35 మంది నీట్‌కు అర్హత సాదించారు. ప్రభుత్వ కోటా కింద గత ఏఁడాది వరకు 4 సీట్లు ఇచ్చేవారు.

# చరిత్రలో ఎన్నడూలేని విధంగా మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తున్నాం

### ఎమ్మెల్యే వసుపల్లి గణేష్‌కుమార్



విశాఖపట్నం : చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. గత పాలకులు మత్స్యకారులకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సబ్సిడీ పెంచాలని, అన్ని బోట్లకు సబ్సిడీ ఇవ్వాలని ప్రాధేయపడినా దయచూపలేదని, వారి ఆవేదన తెలుసుకొని రెండుసార్లు అసెంబ్లీలో మాట్లాడి సిఎం చంద్రబాబు, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మత్స్యశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. ఇక నుంచి అన్ని బోట్లకు డీజిల్ సబ్సిడీ అందుతుందన్నారు. వేట విరామ పరహారం నేరుగా మత్స్యకారుల బ్యాంకు అకౌంట్లులేనే వేస్తున్నామన్నారు. ఆశీలమెట్ట కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అల్లూరి సత్యనారాయణరెడ్డి, లక్ష్మీశివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణీలో ప్రజాసమస్యల వెల్లువ

### కలెక్టర్ కార్తికేయ మిశ్రా



కాకినాడ:తూర్పు గోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి మీకోసం కార్యక్రమంకు జిల్లాలోని పలు ప్రాంతాల నుండి విచ్చేసిన ఆర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కార్తికేయకు,జాయింట్ కలెక్టర్ మల్లికార్జునకు విన్నవించారు వీటిలో భాగంగా కె గంగవరం మండలం దాగేరు గ్రామానికి చెందిన ఎలక్ట్రిషియన్ గంపల చిన గోవిందుకు గత సంవత్సరం జనవరి నెలలో విద్యుత్ ఘాతంచే శరీరమంతా కాలిపోయింది ఆరోగ్య శ్రీ పధకం ద్వారా రాజానగరం ఆసుపత్రి జి యస్ ఎల్ లో కొంత వరకు వైద్యం అందించారని తదుపరి పూర్తి స్థాయి వైద్యం అందిస్తేనే గాని పనిచేయలేని పరిస్థితిలో ఉన్నానని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయగా దీనిపై కలెక్టర్ స్పందిస్తూ అతనికి వెంటనే ప్లాస్టిక్ సర్జరీ ద్వారా వైద్యం అందించాలని డిఎంహెచ్ ఓకు, ఎన్టీఆర్ వైద్యా సేవ కోఆర్డినేటర్‌కు ఆదేశించారు డిఎంహెచ్‌ఓ ఈనెల 21 గురువారం నాడు జిజిహెచ్ ప్లాస్టిక్ సర్జరీ ఓపిలో తదుపరి వైద్య సేవలు నిమిత్తం చూపించుకోవాల్సిందిగా గంపల చిన గోవిందుకు సూచించారు

# చిత్రభాను

## సింగిల్ టేక్‌లో ఓకే చేశాను!



హాస్యాన్ని పండించడం చాలా కష్టం. అందులోనూ భాష తెలియనప్పుడు చాలా ఇబ్బందిగా వుంటుంది. భాష తెలిస్తేనే టైమింగ్ పక్కాగా కుదురుతుంది. అందుకే తెలుగు నేర్చుకుంటున్నాను అన్నారు సిద్ధి ఇద్నాని. ఆమె కథానాయికగా పరిచయమవుతున్న చిత్రం జంబలకిడిపంబ. శ్రీనివాసరెడ్డి హీరోగా నటిస్తున్నారు. మను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సిద్ధి ఇద్నానీ మాట్లాడుతూ మా నాన్న సింధీ, అమ్మ గుజరాతీ. వాళ్లది ప్రేమ వివాహం. మా అమ్మ హిందీ ధారావాహికలతో పాటు గుజరాతీ సినిమాల్లో నటించేవారు. అమ్మతో కలిసి షూటింగ్‌లకు వెళ్లేదాన్ని. అప్పటి నుంచే సినిమాలపై ఆసక్తి పెరిగింది. మాస్ కమ్యూనికేషన్ పూర్తిచేసిన తరువాత ఓ గుజరాతీ చిత్రంలో నటించాను. ఓ ఏజెన్సీ ద్వారా జంబలకిడిపంబలో నటించే అవకాశం వచ్చింది. నా కళ్లు, నవ్వు చూసి నన్ను ఎంపిక చేశారు. ఇందులో నేను ఫ్యాషన్ డిజైనర్‌గా కనిపిస్తాను. అయితే సెకండ్ హాఫ్‌లో మాత్రం నేను అబ్బాయిగా, శ్రీనివాసరెడ్డి అమ్మాయిగా కనిపిస్తాం. ఆ సన్నివేశాలు నవ్వులు పూయిస్తాయి. శ్రీనివాసరెడ్డిని అనుకరించడానికి తను నటించిన చిత్రాలు చూశాను. గతంలో వచ్చిన జంబలకిడిపంబకు, మా చిత్రానికి ఎలాంటి పోలిక వుండదు. తొలి సన్నివేశాన్ని సింగిల్ టేక్‌లో ఓకే చేశాను. ఇక అక్కడి నుంచి వెనుతిరిగి చూసుకోలేదు. ఆద్యంతం వినోదాత్మకంగా రూపొందిన ఈ చిత్రం తప్పకుండా అందరిని ఆకట్టుకుంటుంది అని చెప్పింది.

## రామ్‌చరణ్‌తో జోడీగా...



తొలి చిత్రం(భరత్ అనే నేను)తోనే టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు బాలీవుడ్ భామ కైరా అడ్వాణీ. 'భరత్ అనే నేను' సినిమా విడుదలకు ముందే రెండో ప్రాజెక్ట్‌కు సంతకం చేసేశారు. బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో కైరా.. రామ్‌చరణ్‌కు జోడీగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. అయితే కైరాకు ఈరోజు షూటింగ్ లేదట. దాంతో హైదరాబాద్ అంతా తిరగాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని ఆమె ట్విటర్ ద్వారా వెల్లడించారు.

'హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఈరోజు నాకు హాలీడే . కాబట్టి హైదరాబాద్‌లో నేను చూడాల్సిన చక్కని ప్రదేశాలు ఏమన్నా ఉంటే చెప్తారా?' అని నెటిజన్లను కోరారు. దానికి నెటిజన్లు విభిన్నమైన ఐడియాలు ఇస్తున్నారు.

## అనుష్కతో పెళ్లి గురించి పెదవి విప్పిన ప్రభాస్!



బాహుబలి రిలీజ్ తర్వాత యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్, అనుష్క పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు జాతీయ మీడియాలో హల్‌చల్ రేపాయి. తమ పెళ్లి గురించి వస్తున్న వార్తలపై సందర్భోచితంగా ప్రభాస్, అనుష్క క్లారిటీ ఇచ్చారు. ఇటీవల పెదనాన్న, రెబల్‌స్టార్ క ృష్ణంరాజు ప్రభాస్ పెళ్లి గురించి వ్యాఖ్యలు చేయడంతో మరోసారి జాతీయ పత్రికలను ఆకర్షించింది. ఈ ఏడాది పెళ్లి చేసుకోబోతున్నారనే వార్త అభిమానుల్లో సంబరాన్ని నింపింది. అయితే ఇటీవల ఓ మీడియాతో మాట్లాడుతూ.. అనుష్కతో పెళ్లి గురించి ప్రభాస్ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారనేది ఆ కథనంలో కీలకమైన పాయింట్. ప్రభాస్ ఏమన్నారంటే.. ఇలా పలు సందర్భాల్లో వివరణ ఇచ్చినప్పటికీ ప్రభాస్, అనుష్క పెళ్లి వార్తలపై గాలివార్తలకు అడ్డుకట్టపడలేదు. ఆ మధ్య మీడియాతో మాట్లాడుతూ.. మా మధ్య ఉన్న కేవలం ఫ్రెండ్‌షిప్ మాత్రమే ఉంది. అంతకు మించిన రిలేషన్ మా మధ్య లేదు. మేము పెళ్లి చేసుకోవడం లేదు. జీవితంలో సెటిల్ కావడానికి తొందరపడటం లేదు అని అనుష్క స్పష్టం చేశారు. అనుష్క పెళ్లి గురించి రూమర్లు ఇదిలా ఉండగా, అనుష్క హిమాలయాల సందర్శనకు వెళ్లడంతో మరోసారి అనుష్క పెళ్లివార్తలు తెరపైకి వచ్చాయి. భాగమతి తర్వాత ఓ చిత్రంలో మాత్రమే అనుష్క నటిస్తున్నారు. పెళ్లి కారణంగానే సినిమాలు అంగీకరించడం లేదనే వార్త సినీవర్గాల్లో ప్రచారమైంది. పెళ్లి కోసమే పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్నారనే వార్త కూడా వైరల్ అయింది. నా వ్యక్తిగత విషయం అనుష్క పెళ్లి గురించి ఇలాంటి వార్తలు ఓ వైపు కొనసాగుతుంటే మరోవైపు ప్రభాస్ పెళ్లి గురించి ఓ జాతీయ ఆంగ్ల వెబ్‌సైట్ ఓ కథనాన్ని ప్రచురించింది. తన పెళ్లి వార్తలపై ప్రభాస్ స్పందిస్తూ.. మ్యారేజ్ అనేది నా వ్యక్తిగత విషయం. అది అందరికీ తెలియజేయాల్సిన అవసరం లేదు అనే విధంగా వ్యాఖ్యలు చేసినట్టు కథనలో పేర్కొన్నది. పెళ్లి వార్తను దాచిపెట్టను ఎంగేజ్‌మెంట్ జరిగిందని వస్తున్న వార్తలపై ప్రభాస్ స్పందిస్తూ.. ఒకవేళ అదే జరిగితే దాచుకోవాల్సిన అవసరం లేదు. మీడియాకు, నా ఫ్యాన్స్‌కు తప్పకుండా తెలియజేస్తాను అని ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చినట్టు కథనంలో వెబ్‌సైట్ పేర్కొన్నది. సాహో బిజీలో ప్రభాస్ ప్రస్తుతం సాహో చిత్ర షూటింగ్ బిజీలో ప్రభాస్ తలమునకలై ఉన్నారు. సంక్రాంతికి సాహో చిత్రం రిలీజ్ అయ్యే అవకాశం కనిపిస్తున్నది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి శ్రద్ధాకపూర్, నీల్ నితిన్ ముఖేష్ తదితరులు నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన యాక్షన్ సీన్లను ఇటీవలే దుబాయ్ చిత్రీకరించారు.

## పవిత్ర ప్రేమికుడు



జీవిత పథంలో ప్రేమ ఒక అందమైన భావన. ప్రణయానుభూతుల్ని ఆస్వాదించకుండా యుక్తవయసును దాటొచ్చిన వారెవరూ ఉండరు. టీనేజ్‌లో ప్రతి ఒక్కరూ ఓ లవరే. అలాంటి మధురమైన ప్రేమజ్ఞాపకాలకు వెండితెర ద ృశ్యరూపమే మా లవర్ చిత్రం అంటున్నారు అనీశ్‌క ృష్ణ. ఆయన దర్శకత్వంలో రాజ్‌తరుణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం లవర్. దిల్‌రాజు నిర్మాణ సారథ్యంలో ... పతాకంపై హర్షిత్‌రెడ్డి నిర్మిస్తున్నారు. శిరీష్ సమర్పకుడు. గాయత్రి సురేష్ కథానాయిక. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. జూలై రెండోవారంలో విడుదల చేయనున్నారు. ప్రేమలోని సరికొత్త కోణాన్ని ఆవిష్కరించే చిత్రమిది. పవిత్రమైన ప్రేమకు నిదర్శనంగా ఉంటుంది. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌కు మంచి స్పందన లభించింది అని చిత్ర బ ృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి, సంగీతం: అంకిత్‌తివారి, రిషి రిచ్, ఆర్కో, తనీష్ బాగ్చి, సాయికార్తీక్, పాటలు: సిరివెన్నెల సీతారామశాస్త్రి.

## 21న పంతం గీతాలు



గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం పంతం. ఫర్ ఎ కాజ్ ఉపశీర్షిక. కె.చక్రవర్తి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మెహరీన్ కథానాయిక. శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బ ృందం హైదరాబాద్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ మా సంస్థలో నిర్మిస్తున్న ఏడవ చిత్రమిది. హీరో గోపీచంద్ నటిస్తున్న 25వ సినిమా. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాం. మేకింగ్‌పరంగా ఎక్కడా రాజీపడలేదు. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. జూలై 5న విడుదల చేస్తామని మేం ఏప్రిల్‌లోనే చెప్పాం. ఆ ప్రకారమే పక్కా ప్రణాళికతో చిత్రీకరణ పూర్తి చేశాం. ఇటీవల యు.కె, లండన్, స్కాట్లాండ్‌లో కీలక సన్నివేశాలను, పాటల్ని చిత్రీకరించాం.

ఈ నెల 21న విజయవాడలో ఆడియోను, 24న వైజాగ్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహిస్తాం. చిత్ర ప్రచార విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మంచి నటీనటులు, సాంకేతిక నిపుణులతో ఈ చిత్రాన్ని నిర్మించాం అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ నేను, మా టీమ్ కలిసి మంచి ప్రయత్నం చేశాం. సినిమా చాలా బాగా వచ్చింది.

మా ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాం అన్నారు. ప ృథ్వీ, జయప్రకాష్‌రెడ్డి ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి మాటలు: రమేష్‌రెడ్డి, ఆర్ట్: ఎ.ఎస్. ప్రకాష్, స్క్రీన్‌ప్లే: కె. చక్రవర్తి, బాబీ, సంగీతం: గోపీసుందర్, సినిమాటోగ్రఫీ: ప్రసాద్ మూరెళ్ల.

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750

చదవండి
చదివించండి
విజయభాను



# నేటి నుండి మాధవధార శ్రీ కుంచుమాంబ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

భక్తులకు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు

భక్తుల సౌకర్యార్థం స్వచ్ఛందంగా

మంచినీరు, మజ్జిగ, తీర్థప్రసాదాల పంపిణీ

ఘనంగా ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీ



































VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 Phone : 2564353, Fax : 0891-2569004 e-mail: vijayabhanudaily@gmail.com